నేటి నిజం
తెలుగు దినపత్రిక
website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com
హైదరాబాద్ గురువారం 11-12-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:101 పేజీలు:6 వెల: రూ.1/-

**నమ్మలేని నిజాలు**

'ధూం'ల విధ్వంసం
దీపావళి ఆనందం
కాలుష్య పురి.

బూరికంకాళం
రాకాసి మత్తగజం
నేలపై నిజం.

గెలుపే లక్ష్యం
హామీలు గంగపాలు
నోట్ల వ్యాపారం

కాంతి విన్యాసం
పాప దహనజ్వాల
నియంత అంతం.

చెమట కష్టం
కూటికొరకు యుద్ధం
సహజ నిధి.



- రేడియమ్
సెల్: 9291527757

**శ్రీనిజాలు**

అన్ని రంగాల్లో మెరుగె
తెలంగాణ ఓ మాడల్ !
ఆర్థికవేత్త దువ్వూరి
కొనియాడగపుట్టె హడల్ !
ఈ గ్లోబల్ సమ్మిట్ లో
తెలంగాణ హైలైట్
ఇరు ఆంబోతుల్లారా !
చేయకండి లోలైట్ !



- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

# హైదరాబాద్‌ను స్టార్టప్ క్యాపిటల్ ఆఫ్ ఇండియాగా మారుస్తాం: సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్, డిసెంబర్ 10: (నేటినిజం ప్రతినిధి): హైదరాబాద్‌లో ఉన్న అగ్రస్థాయి స్టార్టప్స్‌లో గూగుల్ ఒకటని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. మీరు యువకులు, శక్తివంతులు.. సాధారణంగా మీరు మీ కలలను సాకారం చేసుకోవాలనుకుంటారని పేర్కొన్నారు. ఇవాళ(బుధవారం) టీ హబ్‌లో గూగుల్ స్టార్టప్ ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఉన్నత ఆశయాలతో 1998లో ఇద్దరు స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ మిత్రులు ఇద్దరు కలిసి కాలిఫోర్నియాలో ఒక గ్యారేజీలో ఓ స్టార్టప్‌ను ప్రారంభించారని తెలిపారు.

అదే నేటి ప్రఖ్యాత గూగుల్ కంపెనీగా అవతరించిందని గుర్తుచేశారు. తెలంగాణ భవిష్యత్ అభివృద్ధిని ఆకాంక్షించి ప్రపంచానికి తెలంగాణ బ్రాండ్‌ను పరిచయం చేయాలని గత రెండు రోజులు, మనం తెలంగాణ రైజింగ్ 2047 గ్లోబల్ సమ్మిట్‌ను నిర్వహించామని వివరించారు. జాతీయ అంతర్జాతీయ కార్పొరేట్ల సమక్షంలో తెలంగాణ భవిష్యత్ కోసం మన విజన్‌ను ఆవిష్కరించామని పేర్కొన్నారు. 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్లు ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను తీర్చిదిద్దాలనే లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. గత 20 ఏళ్ల క్రితం ప్రారంభించిన అనేక స్టార్టప్స్ నేడు బిలియన్ల డాలర్ల కంపెనీలుగా ఎదిగాయని చెప్పుకొచ్చారు సీఎం రేవంత్‌రెడ్డి.

## ఫుట్‌బాల్‌లో సమష్టి కృషి అవసరం..

'గూగుల్, ఆపిల్, అమెజాన్, టెస్లా, ఫేస్‌బుక్ ఇలాంటి గొప్ప ఉదాహరణలు ఎన్నో ఉన్నాయి. గత 25 సంవత్సరాల్లో సాఫ్ట్‌వేర్ సర్వీసెస్, ఫార్మా, లైఫ్ సైన్సెస్ రంగాల్లో హైదరాబాద్‌లో చాలా స్టార్టప్స్ పెద్ద కంపెనీలుగా ఎదిగాయి. తెలంగాణ రైజింగ్ విజన్ స్టార్టప్స్ కోసం మీ ప్రణాళికలు ఏంటని అడిగితే... స్టార్టప్స్‌ని ఫుట్‌బాల్ ఆటతో పోలుస్తాం. నేను ఆ ఆట ఆడతాను. ఫుట్‌బాల్‌లో సమష్టి కృషి అవసరం. పట్టుదలతో సాధన చేయాలి. ఇది టీమ్ వర్క్. కానీ చివరకు గెలుపు చాలా ముఖ్యం. స్టార్టప్స్ కూడా అదే విధంగా ఉండాలి. ఈ రోజు నుంచి హైదరాబాద్ ప్రోడక్ట్ బేస్డ్ స్టార్టప్స్, ఇన్నోవేటీవ్ స్టార్టప్స్, ఐపీ ఇంటెన్సీవ్ స్టార్టప్స్ వీటి పైనే దృష్టి పెట్టాలి' అని సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు.

## యూనికార్న్ కంపెనీలుగా ఎదగాలి..

'హైదరాబాద్ కేవలం స్టార్టప్స్ హబ్‌గా ఎదగడమే కాదు. ఆ కంపెనీలు యూనికార్న్ కంపెనీలుగా ఎదగాలని కోరుకుంటున్నాం. హైదరాబాద్ నుంచి కనీసం 100 స్టార్టప్‌లు యూనికార్న్ కంపెనీలుగా ఎదగాలని ఆశిస్తున్నాం. కనీసం 1 బిలియన్ డాలర్ల విలువ కలిగిన కంపెనీలుగా ఎదగాలి. 2034 నాటికి వాటిల్లో కనీసం 10 సూపర్ యూనికార్న్ కంపెనీలుగా ఎదగాలి. అందుకోసం రాష్ట్రంలో ఒక మంచి ఎకోసిస్టమ్‌ను సృష్టించాలనుకుంటున్నాం. తెలంగాణ ప్రభుత్వం, గూగుల్ మీకు అవసరమైన సహకారం అందించడానికి సిద్ధంగా ఉన్నాయి. స్టార్టప్‌ల కోసం మా ప్రభుత్వం రూ. 1000 కోట్లతో స్టార్టప్స్ ఫండ్ ఏర్పాటు చేస్తుంది. ఆ ఫండ్స్‌ను వినియోగించుకోండి. తద్వారా స్టార్టప్‌లు గూగుల్ స్థాయిలో లేదా 1 బిలియన్ డాలర్ల కంపెనీగా ఎదగాలని కోరుకుంటున్నాం' అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# సౌదీ ఎడారిలో వర్ష బీభత్సం.. నీటమునిగిన రోడ్లు..

న్యూఢిల్లీ, డిసెంబర్ 10:సౌదీ అరేబియాలో వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. జెడ్డా, మక్కా సమీపంలోని పలు ప్రాంతాల్లో కురిసిన వర్షంతో రోడ్లు చెరువుల్లా మారిపోయాయి. దీంతో వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసి, రాబోయే రెండు రోజులు వాతావరణం ఇలాగే కొనసాగు తుందని హెచ్చరించింది.

సాధారణంగా సౌదీ అరేబియా పేరు వింటే మండే ఎడారులు గుర్తుకు వస్తాయి. అలాంటిది ఇప్పుడు ఇక్కడ మేఘాలు గర్జిస్తున్నాయి. సౌదీ అరేబియాలోని మక్కా, జెడ్డా, రబిగ్, ఖులైస్, బహ్రా పరిసర ప్రాంతాల్లో భారీ వర్షం, ఆకస్మిక వరదలు, బలమైన ఈదురు గాలులు, ఉరుములతో కూడిన తుఫాన్ బీభత్సం సృష్టిస్తున్నాయి. దీంతో హైల్, ఖాసిమ్, తబుక్, మక్కా, అసిర్, అల్ బహ వంటి ప్రాంతాలకు రెడ్, ఆరెంజ్, ఎల్లో అలర్ట్ జారీ చేసింది వాతావరణ శాఖ. ప్రజలు ఎట్టి పరిస్థితుల్లో బయటకు రావొద్దని.. భద్రతా మార్గదర్శకాలను పాటించాలని అధికారులు కోరుతున్నారు. ముఖ్యంగా రెడ్ అలర్ట్ జోన్లు చాలా ప్రమాదాల్లో ఉన్నాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

భారీ వరదల కారణంగా రోడ్లు సరస్సుల్లా మారిపోవడంతో పాఠశాలలకు సెలవు ప్రకటించారు. విద్యార్థులకు ఆన్‌లైన్ తరగతులు నిర్వహించాల్సిందిగా సూచించారు. సినిమా హాల్స్ మూసివేశారు. వరదల కారణంగా రోడ్లపై నీరు చేరడంతో ప్రజలు బయటకు వచ్చే అవకాశం లేకుండా పోయింది. రానున్న రెండు రోజులు వర్షాలు పడే అవకాశం ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. భారీ వర్షాల నేపథ్యంలో అంతర్జాతీయ కార్యక్రమాలు వాయిదా వేయాల్సి వచ్చింది. జెడ్డాలో జరుగుతున్న రెడ్ సీ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌ను అకస్మాత్తుగా నిలిపివేయాల్సి వచ్చింది. భద్రతా కారణాల దృష్ట్యా అమెరికా రాయబార కార్యాలయం తన గాలా ఈవెంట్‌ను కూడా రద్దు చేసుకుంది.

మదీనా, తబుక్, అల్ జాఫ్, ఉత్తర సరిహద్దు ప్రాంతాలతో పాటు తూర్పు ప్రావిన్స్‌లో బుధవారం, గురువారం వర్షాలు కొనసాగే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. వరదల కారణంగా ప్రాణ నష్టాలు జరుగుతున్నాయని పుకార్లను నమ్మవొద్దని.. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రిస్క్యూ టీమ్స్ తో ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని అధికారులు తెలిపారు.

# ఓయూకు గుడ్ న్యూస్.. సీఎం రేవంత్‌రెడ్డి కీలక నిర్ణయం

హైదరాబాద్, డిసెంబర్ 10: (నేటినిజం ప్రతినిధి): ఉస్మానియా వర్సిటీని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇవాళ(బుధవారం) సందర్శించారు. ఈ సందర్భంగా ఓయూకు రూ.1000 కోట్ల నిధులను సీఎం విడుదల చేశారు. ఈ నిధులను విద్యార్థులకు అంకితం చేశారు. అలాగే, ఓయూ అభివృద్ధికి రూ.45 లక్షల చెక్కు అందజేశారు పూర్వ విద్యార్థులు. అనంతరం ఆర్ట్స్ కాలేజీ భవనం దగ్గర 'సర్వం సిద్ధం' పేరుతో సభ నిర్వహించారు. ఈ సభలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొని ప్రసంగించారు. స్వరాష్ట్ర ఆకాంక్షను బలంగా ఉస్మానియా యూనివర్సిటీ వినిపించిందని తెలిపారు.

భవిష్యత్తు ప్రణాళికలపై చర్చించడానికి ఓయూకు వచ్చానని వివరించారు. గతంలో ముఖ్యమంత్రులను అడ్డుకున్న చరిత్ర ఉందని ప్రస్తావించారు. మీరు ఎందుకు ఓయూకు వెళ్లే ధైర్యం చేస్తున్నారని కొంతమంది తనతో అన్నారని గుర్తుచేశారు. మీరిచ్చే సూచనలు, మేధావులు ఇచ్చే సలహాలతో ఓయూను అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దుతానని స్పష్టం చేశారు. విద్యార్థులకు తమ ప్రభుత్వం అండగా ఉండాలనే ఓ ఆలోచనతో ఇక్కడకు వచ్చానని వ్యాఖ్యానించారు సీఎం రేవంత్‌రెడ్డి.

ధైర్యంతో కాదని.. విద్యార్థుల గుండెల నిండా ఉన్న అభిమానంతో ఆర్ట్స్ కాలేజీ వద్దకు వచ్చానని వ్యాఖ్యానించారు. తమ ప్రసంగాలు చదువుకొని కాదని.. తన మనసులో ఉన్నది చెప్పాలని ఇక్కడకు వచ్చానని చెప్పుకొచ్చారు. గుండెల నిండా అభిమానం నింపుకుని ఓయూకు వచ్చానని తెలిపారు. పురాతన యూనివర్సిటీలో ఉస్మానియా ఒకటని వివరించారు. ఉస్మానియా యూనివర్సిటీకి గొప్ప చరిత్ర ఉందని అభివర్ణించారు. ఇక్కడకు రావాలంటే ధైర్యం కాదని.. అభిమానం కావాలని చెప్పుకొచ్చారు. తెలంగాణలో చదువు లేకున్నా ఆధిపత్యాన్ని సహించరని పేర్కొన్నారు.

# ఇండియాలో రైలు టికెట్ ధరలు తక్కువే: మంత్రి అశ్వినీ వైష్ణవ్



న్యూఢిల్లీ: భారత్‌లో రైలు టికెట్ ధరలు అందరికీ అందుబాటులో ఉన్నట్లు రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్(ంబష్ట్రలితినితి ఎజీతిబష్ట్రనిజీలి)తెలిపారు. పొరుగు దేశాలతో పోల్చినా లేక అభివృద్ధి చెందిన దేశాలతో పోల్చినా.. మన రైల్వే టికెట్ ధరలు తక్కువే ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. టికెట్ ధరలను కనిష్ట స్థాయిలో ఉంచేందుకు భారతీయ రైల్వేశాఖ గతేడాది సుమారు 60 వేల కోట్ల సబ్సిడీ ఇచ్చినట్లు ఆయన వెల్లడించారు. కాంగ్రెస్ సభ్యుడు ఎంకే విష్ణు ప్రసాద్ అడిగిన ప్రశ్నకు లోక్‌సభలో మంత్రి వైష్ణవ్ సమాధానం ఇచ్చారు. కోవిడ్‌కు ముందు సీనియర్ సిటిజన్లకు రైలు టికెట్‌లో డిస్కౌంట్ ఉండేదని, ఒకవేళ మళ్లీ ఆ విధానాన్ని ఏమైనా పునరుద్ధరిస్తున్నారా అని కాంగ్రెస్ నేత అడిగారు. ఆ ప్రశ్నకు మంత్రి సమాధానం ఇస్తూ అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే మన దేశంలో రైలు టికెట్ ధరలు కేవలం 5 నుంచి 10 శాతం మాత్రమే ఉన్నట్లు చెప్పారు. పొరుగు దేశాలతో పోలిస్తే కూడా మన రైలు టికెట్ ధరలు చాలా చాలా చౌకగా ఉన్నట్లు మంత్రి తెలిపారు.

# కుప్పకూలిన నాలుగంతస్తుల భవనాలు.. 19 మంది మృతి



న్యూఢిల్లీ, డిసెంబర్ 10:నార్త్ ఆఫ్రికా దేశమైన మొరాకో లో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. అత్యంత జనసాంద్రత కలిగిన నగరాల్లో ఒకటైన ఫెజ్ లో నాలుగు అంతస్తుల ఉన్న రెండు నివాస భవనాలు కుప్పకూలిపోయాయి . ఈ ఘటనలో 20 మంది వరకూ ప్రాణాలు కోల్పోయారు.

స్థానిక మీడియా నివేదికల ప్రకారం.. అల్-ముస్తాక్బాల్ పరిసరాల్లో పక్క పక్కనే ఉన్న రెండు నాలుగు అంతస్తుల భవనాలు ఒక్కసారిగా కుప్పకూలాయి. ఈ భవనాల్లో ఎనిమిది కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. ఈ ప్రమాదంలో ఇప్పటి వరకూ 19 మంది ప్రాణాలు కోల్పోగా.. 16 మంది గాయపడ్డారు. ప్రమాద సమాచారం అందుకున్న స్థానిక అధికారులు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. శిథిలాల కింద చిక్కుకున్న వారిని రక్షించి చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ భవనాలు చాలా కాలంగా నిర్లక్ష్యానికి గురయ్యాయని అధికారులు తెలిపారు.

## కూర్మనాథ స్వామి శతకం పుస్తకావిష్కరణ



డా॥రాధశ్రీ రచించిన 'నల్లగుట్ట శ్రీహరి కుర్మనాథ స్వామి శతకాన్ని' ఆవిష్కరిస్తున్న ఆచార్య ఎల్లూరి శివారెడ్డి

హైదరాబాద్, డిసెంబర్ 10: (నేటినిజం ప్రతినిధి): యువభారతి తెలుగు వెలుగు సమాఖ్య సమావేశం లక్డీకాపూల్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ కళాశాలలో ఆదివారం జరిగింది. పద్యకవి డా॥రాధశ్రీ రచించిన 'నల్లగుట్ట శ్రీహరి కుర్మనాథ స్వామి శతకాన్ని' తెలుగు విశ్వ విద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, యువభారతి అధ్యక్షుడు డాక్టర్ ఆచార్య ఫణింద్ర, వ్యవస్థాపక సమావేశకర్త ఆచార్య వంగుపల్లి విశ్వనాథం, ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహా సంస్కృతాంధ్రా కళాశాల పూర్వ ప్రొఫెసర్ డా॥సంగనభట్ల నర్సయ్య, ఐఐఎంసీ కళాశాల ప్రిన్సిపాల్ కూర రఘువీర్‌తో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో సాధన నరసింహాచార్య, కేవీ ఎన్ ఆచార్య, యువభారతి కార్యదర్శి జేడీ గుంట వెంకట్రావు, సాహితీవేత్త చీకోలు సుందరయ్య పాల్గొన్నారు.



నవంబర్ 23న రాజమహేంద్రవరం స్థానిక తాడితోట సంహిత కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన నటరాజ నృత్యనికేతన్ 43 వసంతాల విజయవిహారోత్సవ కార్యక్రమంలో భాగంగా సప్పా ఎక్సలెన్స్-2025 జాతీయ పురస్కారాన్ని పత్రికారంగంనుండి సాహితీకిరణం సంపాదకులు పొత్తూరి సుబ్బారావుకి ప్రదానం కావిస్తున్న ఆం.ప్ర.శాసనమండలి సభ్యులు సోమువీర్రాజు. చిత్రంలో నృత్యనికేతన్ వ్యవస్థాపక అధ్యక్షులు డా॥సప్పా దుర్గాప్రసాద్ తదితరులు.

**చురక**

గ్లోబలైజు సమ్మిట్‌లో
గొప్పగానే పెట్టుబడులు
కార్యరూపమైనప్పుడే
కలుగు వృద్ధి సవ్వడులు
రైజింగ్ తెలంగాణ
రాష్ట్ర ముఖ్య ధ్యేయం
రాజకీయ అవినీతి
రాజుకుంటే మాయం



-వేల్పుల నారాయణ
9440433475

**రాధశ్రీ రాగాలు**

పర్వదినమగు భోగి
నాడొక మహాభోగి
యెక్కె రైల్వే బోగి
అనును రాధశ్రీ
తగ్గి ఉంటే మొగ్గు
మొగ్గు తుంటే తగ్గు
వదిలిపెట్టును సిగ్గు
అనును రాధశ్రీ



-రాధశ్రీ
సెల్:9494481210

తెలంగాణ భాషా, సాంస్కృతిక శాఖ సౌజన్యంతో
డా॥ మాడభూషి రంగాచార్య స్మారక కమిటీ
1-7-79, చైతన్యపురి, హైదరాబాద్-500060. సెల్ నెంబర్: 9440444019
ద్విదశాబ్ది సభ
స్మరణ (గ్రంథావిష్కరణ)
వేదిక: రవీంద్రభారతి, సమావేశ మందిరం, మొదటి అంతస్థు, హైదరాబాద్
సమయం: 14 డిసెంబర్ 2025 ఆదివారం సాయంకాలం 5.30 ని॥లకు
అధ్యక్షులు : డా॥ డి. చంద్రశేఖరరెడ్డి
ముఖ్య అతిథి, గ్రంథావిష్కరణ : నిఖిలేశ్వర్
విశిష్ట అతిథి : డా॥ ఏనుగు నరసింహారెడ్డి
వక్తలు : సుధామ
డా॥ నాళేశ్వరం శంకరం
డా॥ బెల్లంకొండ సంపత్ కుమార్
డా॥ జతిన్ కుమార్
శీలా సుభద్రాదేవి అధ్యక్షులు
అందరూ ఆహ్వానితులు
మాడభూషి లలితాదేవి కన్వీనర్

# తిరుమలలో మరో కుంభకోణం బట్టబయలు..

తిరుపతి, డిసెంబర్ 10: తిరుమల దేవస్థానంలో రూ.54 కోట్ల నకిలీ పట్టు దుపట్టా మోసం బయటపడింది. ఈ విషయమై ఏసీబీ దర్యాప్తు ప్రారంభించింది. దీంతో త్వరలోనే మరిన్ని వివరాలు బయటపడనున్నాయి. అయితే, తాజాగా దీనిపై ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించారు. ఓ జాతీయ మీడియాతో మాట్లాడారు.

ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. 'ఏదైనా దేవస్థానంలోకి వెళితే.. మీకు కొంత దుష్ప్రవర్తన కనిపిస్తుంది. పరకామణి విషయంలోనూ చాలా మంది చట్ట విరుద్ధంగా వ్యవహరించారు. టీటీడీలో ఎప్పటి నుంచో కొంతమంది ఇష్టమొచ్చినట్లుగా చేశారు. ఈ మోసం ఇప్పుడు వెలుగులోకి రావడానికి ఏకైక కారణం.. మనకు బలమైన టీటీడీ బోర్డు, ప్రభుత్వం ఉండటమే. నేడు మనందరికీ ముఖ్యమంత్రి నుంచి మార్గదర్శకత్వం ఉంది. సరైన ప్రణాళికలతో ముందుకు సాగుతున్నాం. గతంలో వేము పుకార్లను మాత్రమే విన్నాం. ఇప్పుడు అక్కడ ఏం జరిగింది.., ఏం చేశారో.. నిజాలు తెలుస్తున్నాయి. భారతదేశంలోని ఇతర మతాలతో పోలిస్తే.. ప్రభుత్వ చర్యలు, బహిరంగ ప్రకటనలకు సంబంధించి హిందువులను అవమానంగా చూస్తున్నారు. నేను గతంలో చెప్పినట్లుగా హిందువులను లక్ష్యంగా చేసుకుని నిలదీస్తున్నారు' అని ఉప ముఖ్యమంత్రి పవన్ చెప్పారు.

# సమాజాన్ని చైతన్యపరిచే కవితలు మరిన్ని రావాలి



పుస్తకావిష్కరణలో జస్టిస్ సుదర్శన్‌రెడ్డి, తెలకపల్లి రవి, చంద్రశేఖరరెడ్డి, నిఖిలేశ్వర్, ప్రొ॥కల్పనా కన్నాబిరావ్, డా॥నందిని సిధారెడ్డి, ముత్యంరెడ్డి

హైదరాబాద్, డిసెంబర్ 10:(నేటినిజం ప్రతినిధి): రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను కాపాడుకోవాలని సుప్రీం కోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్ రెడ్డి పిలుపు నిచ్చారు. ఆ దిశగా లౌకిక వాదాన్ని కాపాడుకోవడానికి రచయితలు, కవులు తమ వంతు కృషి చేయాలని కోరారు. ఆదివారం బాగ్ అంబర్‌పేట డివిజన్ తిలక్ నగర్ చైరస్తాలోని హొటల్‌లో ఏర్పాటు చేసిన కవి, రచయిత, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహిత నిఖిలేశ్వర్ రాసిన 3 పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు.

జస్టిస్ సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ నిఖిలేశ్వర్ రాసిన పుస్తకాలు నేటి యువతకు, సమాజానికి ఉపయోగపడతాయన్నారు. 4 లేబర్ కోడ్స్ వల్ల కార్మికుల హక్కులు కాలరాసేలా ఉన్నాయని ఆరోపించారు. కేంద్ర ఉదాసీనత వల్లే విమాన ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారని ఆయన వాపోయారు.

కార్యక్రమంలో చంద్రశేఖర్ రెడ్డి, ప్రొఫెసర్ కల్పనా కన్నభిరావ్, కట్టా ముత్యంరెడ్డి, డా॥ నందిని సిధారెడ్డి, జతిన్ కుమార్, జర్నలిస్టు తెలకపల్లి రవి పాల్గొన్నారు.

# ఘోర రోడ్డు ప్రమాదం.. స్కూల్ పిల్లల ఆటో బోల్తా.. ఒకరు మృతి, 14 మందికి గాయాలు

కామారెడ్డి, డిసెంబర్ 10: స్కూల్ పిల్లలను తీసుకెళ్తున్న ఆటో బోల్తాపడి పదవ తరగతి విద్యార్థి అక్కడికక్కడే మృతిచెందారు. మరో 14 మంది విద్యార్థులకు గాయాలయ్యాయి. కామారెడ్డి జిల్లా జుక్కల్ మండలంలో ఈ ప్రమాదం జరిగింది. మండలంలోని సావర్గావ్ గ్రామం నుంచి ఖండే గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు విద్యార్థులను తీసుకెళుండగా ఆటో బోల్తాపడింది.

ప్రమాదంలో పదవ తరగతి విద్యార్థి ప్రణవ్ (15) అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. మరో 14 మంది విద్యార్థులు గాయపడ్డారు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి పంపించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



నేటినిజం
# సాహితీ కెరటాలు
E-mail : netinijam93@gmail.com website: www.netinijam.com
2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 గురువారం 11-12-2025


**సప్త పదులు**

ప్రజ్ఞాశాలి
ప్రతిభాశాలి
చంచలమైన
స్వభావాన్ని
ఆచంచలం చేస్తాడు
ధీశాలి.
-కె.ఎమ్.కె.మూర్తి
9441802694

గొప్పలు
అప్పులు
చేస్తే తప్పకుండ
అనుభవిస్తూ
పడాల్సిందే
తిప్పలు
-అడ్డా సత్యవేణి.
9494178 223

ఆగ్రహం
విగ్రహం
మనిషికి
అన్నిటికన్నా
విలువైన ఆభరణం
మనోనిగ్రహం
-బెన్నూరి వనజాక్షి
హైదరాబాద్

**సప్త పదులు**

నేతలు
నీతులు
పార్టీ మారితే చాలు
వారౌతారు
పునీతులు
-సీతారామారావు
పొత్తూరి
8008322769

దూషించకు
ద్వేషించకు.
పరులసొమ్ము
కలలోనైనా
కావాలని
కోరి ఆశించకు!
-డా.గన్నోజు శ్రీనివాసాచారి
8555899493

కష్టం
ఇష్టం
జీవిత సారాన్ని
గ్రహించు,
కాదంటే
కష్టం
-సరోజ రెబ్బాప్రగడ
9663306023

# సామాజిక చైతన్యంలో కవుల పాత్ర కీలకం

## దాస్యం సేనాధిపతి సప్తతి సంచిక "అక్షర గీతం" ఆవిష్కరణ సభలో మహారాష్ట్ర పూర్వ గవర్నర్ సి. హెచ్. విద్యాసాగర రావు

సామాజిక చైతన్యం లో కవుల పాత్ర కీలకమని మహారాష్ట్ర పూర్వ గవర్నర్ సి.హెచ్.విద్యాసాగర్ రావు అన్నారు. డిసెంబర్ 7వ తేదీ ఆదివారం నాడు సుర వరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వ విద్యాల యం ఎన్. టి.ఆర్ అడిటోరియంలో ఉదయ సాహితి తెలంగాణ ఆధ్వర్యంలో జరి గిన ప్రముఖ కవి, రచయిత, విమర్శకులు దాస్యం సేనాధిపతి 70 వ జన్మదినోత్సవం సందర్భంగా వెలువరించిన సప్తతి సంచిక 'అక్షర గీతం' గ్రంథావిష్కరణ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై గ్రంథాన్ని ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు వందలకు పైగా కవులు, రచ యితలు, బంధుమిత్రులు దాస్యం సేనాధి పతి జీవితాన్ని, సాహిత్యాన్ని విభిన్న కోణా ల్లో ఆవిష్కరించడం అభినందనీయమని, కవిగా, రచయితగా సేనాధిపతి చేస్తున్న కృషిని అక్షర గీతం లో నిక్షిప్తం చేసిన ప్రధాన సంపాదకులు శ్రీదాస్యం లక్ష్మయ్య ను అభినందించారు. కులమతాలకు అతీతంగా సాహితీకారులు తమ రచనలు చేయాలని సూచించారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో కవులు, రచయితలు పోషించిన పాత్ర అభినందనీయమని అన్నారు.

ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాలుగా విభజింపబడినప్పటికీ.. అందరూ అన్నదమ్ములుగా కలిసి ఉండి తెలుగు భాషా వికాసానికి కృషిచేయాలని సూచిం చారు. మానవతా వాదమే ఆలంబనగా సృజనకా రులు తమ రచనలు చేయాలని కోరారు. ప్రస్తుత నేపథ్యంలో బి. సి.లకు 42 శాతం

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ తొలి కాళోజి పురస్కార గ్రహీత, ప్రముఖ కవి డా॥ అమ్మంగి వేణుగోపాల్ మాట్లాడుతూ సేనాధిపతి పదిహేను వందల సమీక్షలు రాయడం గొప్ప విషయమని పేర్కొన్నారు. కవిగానూ ఆయన రచనలు అందరినీ ఆకట్టుకున్నాయని తెలిపారు.

గౌరవ అతిథి గా పాల్గొన్న నేటి నిజం పత్రిక సంపాదకులు బైస దేవదాసు మాట్లాడుతూ దాస్యం సేనాధిపతి జీవితాన్ని మెరుగుపరచుకొని, వృత్తి లో న్యాయం చేసి, సాహిత్య రంగం లో ఓ ప్రత్యేక గుర్తింపు పొందుతున్న 'అక్షర పతి' అని కొనియాడారు.

పేర్కొన్నారు. అనం తరం దాస్యం సేనాధిపతి దంపతుల కు అతిథులు ఘనంగా సత్కరిం చారు. అక్షర గీతం సంపాదకులు దాస్యం లక్ష్మయ్య, శ్రీమతి సావిత్రి రంజోల్కర్, శ్రీమతి మూర్తి శ్రీదేవి దంపతులను, అక్షర గీతం ముఖ చిత్రకకారులు కళ్యాణం శ్రీనివాస్‌కు దాస్యం సేనాధిపతి సత్కరించారు. దాస్యం సేనాధిపతి తమ స్పందనను తెలియజేస్తూ అక్షర గీతం రూపాకల్పనలో ముఖ్య భూమికను పోషిం చిన సంపాదక వర్గానికి ప్రత్యేక ధన్యవా దాలు


సభలో ప్రసంగిస్తున్న డా॥సుద్దాల అశోక్‌తేజ

వందలాది గ్రంథసమీక్షలు రాసి సాహితీ కారులను ప్రోత్సహించారని తెలిపారు. ఒక్క నేటినిజం పత్రికకే వెయ్యికి పైగా పుస్తక సమీక్షలు రాశారని తెలిపారు. ఆత్మీయ అతిథిగా పాల్గొన్న ప్రముఖ టి.వి. సినీ గేయ రచయిత మౌనశ్రీ మల్లిక్ మాట్లాడుతూ దాస్యం గారు తనకు గురువు తో సమానులని

తెలియజేసారు. సంచికకు రచనలు పంపి నవారికి, ఆవిష్కరణ సభకు హాజరైన బంధుమి త్రులకు, సాహితీ మిత్రులకు ధన్యవాదములు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో ఆచార్య మసన చెన్నప్ప, అక్షర యాన్ వ్యవస్థాపకురాలు శ్రీమతి అయినంపూడి శ్రీలక్మి, ఉదయ


'అక్షర గీతం' గ్రంథావిష్కరణ సభలో మౌనశ్రీ మల్లిక్, గీతారాణి, డా॥నలిమెల భాస్కర్, ఆశ్వాపురం వేణుమాధవ్, డా॥ అమ్మంగి వేణుగోపాల్, డా॥ సుద్దాల అశోక్‌తేజ, ఆవిష్కర్త మహారాష్ట్ర పూర్వ గవర్నర్ సి.హెచ్.విద్యాసాగర్ రావు, దాస్యం సేనాధిపతి, అమర్‌సింగ్ లీలావత్, బైస దేవదాసు, దాస్యం లక్ష్మయ్య, ధూళిపాళ అరుణ,సావిత్రి రంజోల్కర్, అయినంపూడి శ్రీలక్ష్మి, డా॥పోరెడ్డి రంగయ్య.

రిజర్వేషన్లు పెంచాల్సిన అవసరముంద విద్యాసాగర్ రావు అభిప్రాయపడ్డారు. రిజర్వేషన్ల సాధనకై కవులు, రచయితలు మరింత బాధ్యతతో, తమ రచనలతో సమాజాన్ని జాగృత పరచాలని సూచిం చారు. దాస్యం సేనాధిపతి గ్రంథావిష్కరణ సభకు పెద్ద సంఖ్య లో సాహితీ కారులు, బంధు మిత్రులు హాజరు కావడం అభినందనీయమని అన్నారు. ఆంధ్రప్రదేశ్ పూర్వ మంత్రివర్యులు అమర్ సింగ్ తిలావత్ సభను ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ దాస్యం సేనాధిపతి నా చిన్న నాటి మిత్రుడు కావడం సంతోషదా యకం అన్నారు. సాహితీ క్షేత్రంలో ఆయన మరిన్ని విజయాలు సాధించాలని అకాంక్షించారు.

సభకు అధ్యక్షత వహించిన ప్రసిద్ధ సినీ గేయ రచయిత డా॥ సుద్దాల అశోక్ తేజ మాట్లాడుతూ దాస్యం సేనాధిపతి విభిన్న ప్రక్రియల్లో 16 గ్రంథాలు వెలువరించి మెప్పించారని కొనియాడారు. దాస్యం సేనాధిపతి కావ్యకర్తగా, కార్యకర్తగా సాహితీ లోకంలో వెలుగొందుతున్నారని పేర్కొ న్నారు.

అక్షర గీతం సప్తతి సంచిక ప్రధాన సంపాదకులు, ఉదయసాహితి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు శ్రీదాస్యం లక్ష్మయ్య అక్షర గీతం నేపథ్యాన్ని వివరించారు. ప్రముఖ కవయిత్రి, రచయిత్రి శ్రీమతి ధూళిపాళ అరుణ గ్రంథ పరిచయం చేస్తూ... సప్తతి సంచికకు మూడు వందల మందికి పైగా బంధుమిత్రులు, కవులు రచయితలు తమ రచనలు పంపి సేనాధిపతి సాహిత్యాన్ని, వ్యక్తిత్వాన్ని విశ్లేషించడం అభినందనీయమని పేర్కొన్నారు.

విశిష్ఠ అతిథిగా పాల్గొన్న బహుభాషా వేత్త, కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు గ్రహీత డా॥ నలిమెల భాస్కర్ మాట్లాడుతూ దాస్యం సేనాధిపతి మానవ సంబంధాల విషయంలో మానవీయంగా ప్రవర్తిస్తారని పేర్కొన్నారు. స్వర్గీయ పంజాల జగన్నాథం ద్వారా పరిచయమైన సేనాధిపతి అంచెలం చెలుగా సాహితీ రంగాన ఎదిగి అందరి మన్ననలు పొందే విధంగా రచనలు చేయడం స్వాగతించదగిందన్నారు.

పేర్కొన్నారు. దాస్యం సోదరులు డా॥ దాస్యం విజయ్ కుమార్ ఆత్మీయ అతిథిగా పాల్గొని మాట్లాడుతూ అన్నయ్య సేనాధిపతికి మా తాతయ్య నుండి రచనా వ్యాసంగం అబ్బిందని తెలిపారు. సాహితీ రంగంలో ఓ గొప్ప సాహితీకారునిగా నిలవడం సంతోషదా యకమని అన్నారు. ఈ కార్యక్రమం లో అక్షర గీతం సంపాదకులు శ్రీమతి సావిత్రి రంజోల్కర్, ప్రార్థనా గీతాన్ని ఆలపించగా చాత్తాద శ్రీవైష్ణవ సంఘం రాష్ట్ర అధ్యక్షులు


దాస్యం సేనాధిపతి-గీతారాణి దంపతులను సత్కరిస్తున్న అతిథులు.

అశ్వాపురం వేణుమాధవ్ అక్షర గీతం తొలి ప్రతిని స్వీకరించారు.

ఆత్మీయ అతిథి గా పాల్గొన్న శ్రీసరస్వతీ విద్యా పీఠం సీనియర్ కార్యకర్త సరికొండ కోటంరాజు మాట్లాడుతూ సేనాధిపతి విద్యార్థి దశనుండే క్రియాశీలక కార్యకర్త అని పేర్కొ న్నారు. అయన కాలేజీ చదువుతూనే పార్ట్ టైంగా శిశుమందిర్ లో ఆచార్యునిగా పనిచేశారని తెలిపారు.

శాతవాహన టైమ్స్ సంపాదకులు అను ముల దయాకర్ మాట్లాడుతూ తెలంగాణ కళావేదిక ఆవిర్భావం లో దాస్యం గారి మార్గదర్శనం లభించిందని అన్నారు. తెలంగాణ కళావేదిక ఆధ్వర్యంలో సేనాధిపతి రాష్ట్ర స్థాయి పురస్కారాలను కళావేదిక ద్వారా ప్రదానం చేయడం సంతోషదాయకం అన్నారు. కరీంనగర్ సాహితీ గౌతమి ప్రధాన కార్యదర్శి కొత్త అనిల్ కుమార్ మాట్లాడుతూ సాహితీ గౌతమి పూర్వ అధ్యక్షులుగా చేసిన సేవలను గుర్తుచేశారు. ఎన్.సి.సి. మేజర్ రేళ్ళ సంజీవ్ మాట్లాడుతూ క్రమశిక్షణ, నిబద్ధతకు సేనాధిపతి నిదర్శనమని

సాహితీ బాధ్యులు డా॥ తులసి వెంకట రమణాచార్యులు, శ్రీమతి రమాదేవి కులకర్ణి, శ్రీమతి లక్ష్మీ పద్మజ దుగ్గరాజు, శ్రీమతి చిందం సునీత, దాస్యం బాల్య మిత్రులు చెనిగారపు చెన్నయ్య, పి. బాపు, పడాల శ్రీనివాస్ గౌడ్, రిటైర్డ్ ప్రిన్సిపాల్ డా॥ రమేష్, కలవకోట నరేష్ కుమార్ ఏ. గజేందర్ రెడ్డి, డా॥ సబ్బని లక్ష్మీ నారా యణ. సంకెపల్లి నాగేంద్ర శర్మ, డా॥వైరా గ్యం ప్రభాకర్, డా. టి. సంపత్ కుమార్, టి. సత్యనారాయణ, ఆసూరి శ్రీకిషన్, పెద్దూరి వెంకటదాసు, రఘువీర్ ప్రతాప్, గంప ఉమాపతి రిటైర్డ్ ఎస్. పి. చింతా రాంచందర్, గుడ్లదొన సాయి చంద్రశేఖర్, రాణి నల్లమోతు, డా. రాయారపు సూర్యప్ర కాష్, విశ్వయిక, దాస్యం వినోద్ కుమార్, దాస్యం ప్రమోద్ కుమార్, వి. కనకయ్య, డా॥ ఆంజనేయులు, కందుకూరి శ్రీరాములు, ధర్మపురి శ్రీనివాస్, తులసి సత్యనారాయణ, పూదత్తు కృష్ణమోహన్, నీలగిరి అనిత, ఆది విజయలక్ష్మి, కోరు కంటి శశి కిరణ్మయి తోట సాగర్ సుదర్శనం ఉదయ్ కుమా ర్, బుర్ర విజయలక్ష్మీ, కొమురోజు మాధవి, తది తరులు పాల్గొన్నారు.

ఉదయసాహితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీమతి పురిమళ్ల సునంద వందన సమర్పణ చేశారు.

**నానీలు**

అరువు వచ్చిన భాష
అమ్మయ్యింది
అమ్మ మెచ్చిన భాష
కరువయ్యింది.

నేతలకు నేసిన
ఖద్దరు దుస్తులు
నేతన్న బతుకు
పస్తులు


-ఎం.ఏ.గఫార్
9490324834

**నానీలు**


-డా॥శిరీష
98660 50220

బంధం పాతదే
చైతన్యం కొత్తది
అన్నం పాతదే
ఆకలి కొత్తది.

తరువూ తల్లీ
లోక గురువులు
గాయాలు
త్యాగాలుగా మారి తనువులు.

# గొప్ప ఆలోచనలను కలిగించేది సాహిత్యమే

## -డా॥కె.వి.రమణాచారి

హైదరాబాద్, డిసెంబర్ 10:సాహిత్యం మెదడులోని ఎన్నో ఆలోచనలను ఆలొచింపజేస్తుం దని, అందుచేత సాహితీ సృజన చేసే ప్రతి రచయిత తమ ఆలోచనల్లో స్పష్టత ఉండాలని ప్రభుత్వ పూర్వ సలహాదారు డా॥కె.వి.రమణాచారి అన్నారు. భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ఎవర్ గ్రీన్ యూత్ అసోసియేషన్, మానస

ప్రముఖ సాహితీవేత్త భండారుపల్లి రామచంద్ర రావు స్వాగతం పలికిన సభలో ప్రముఖ సంఖ్యాశాస్త్ర నిపుణుడు దైవజ్ఞశర్మ, నక్క భాస్కర్, కవి రఘుశ్రీ తదితరులు పాల్గొన్నారు.

సభకు ముందు జరిగిన కవి సమ్మేళనంలో మాయ కుంట్ల


పుస్తకావిష్కరణలో నక్క భాస్కర్, రఘుశ్రీ, బైస దేవదాసు, ఆవిష్కర్త డా॥కె.వి.రమణాచారి, నేతాజీ దంపతులు బండారుపల్లి రామచంద్రరావు, డా॥ఇ.యాదగిరి

ఆర్ట్ థియేటర్స్ సంయుక్త ఆధ్వర్యంలో రచయిత నేతాజీ రచించిన **'శ్రీహరి చందనం'** కవితా సంపుటి ఆవిష్కరణ సభ రవీంద్ర భారతిలోని సమావేశ మందిరంలో నిర్వహిం చారు. కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా డాక్టర్ కె.వి.రమణా చారి పాల్గొని కథా సంపుటిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మానవుని జీవన వైవిధ్యం నేతాజీ తన కవితలలో తెలియజేశారని పేర్కొన్నారు. అధ్యక్షత వహించిన నేటినిజం సంపాదకులు బైస దేవదాసు మాట్లాడుతూ నేతాజీ చిన్న కవితలలో అర్థవంతమైన భావాన్ని చెప్పారని వివరించారు. సాహితీవేత్త ఆచార్య మసన చెన్నప్ప మాట్లాడుతూ విస్తృతంగా చదివే లక్షణం ఉన్న నేతాజీ మరింత విస్తృత ఆలోచనలు చేసి రచనలు చేయాలని ఆకాం క్షించారు.


నేతాజీ దంపతులను సత్కరిస్తున్న అతిథులు

# డా॥ ఆచార్య ఫణీంద్ర-హృద్యవ్యాఖ్య-భారత భారతి

**పుస్తకత సమీక్ష**

విద్వత్కవి, ఆచార్య ఫణీంద్ర, తెలుగు వచన కవితా సాహిత్యం లో ఏకవాక్య కవితల ప్రక్రియకు ఆద్యులైన సాహిత్య పరిశోధ కునిగా పద్య కవితా పునరుజ్జీ వానికి, పద్య కవితా గ్రంథ రచయితగా ఎన్నో కావ్యా లను, కవితా సంకలనాలను వెలువ రించిన సుప్రసిద్ధులు. ఆంధ్ర మహాభారతంలోని ఆణిముత్యాల వంటి పద్యాలను **'హృద్య పద్యం'** పేరిట తన వ్యాఖ్యాన రచనను, 'భారత భారతి'గా తెలుగు మహా భారత రచనారంభ సహస్రాబ్ది సందర్భం పురస్కరిం చుకొని యువభారతి ప్రచురణగా వెలువ రించటం, మహా భారత పద్య మాధుర్యాన్ని తెలుగు సాహితీ ప్రియులకు మళ్ళీ ఆస్వాదించే చర్విత భాగ్యం కల్పించటమే. అంతే కాకుండా డా॥ ఆచార్య ఫణీంద్ర పద్య రచనా వ్యాఖ్యాతగా, ఆ పద్యమణులను ఉద్దాత రీతిలో విశ్లేషించి పద్య సౌరభాన్ని ఆఘ్రా ణింపచేసారు. తెలుగు పౌరాణిక చలన చిత్రాలలో మధుర గాయని సుశీల కంఠంలో ప్రతిఫలించటం కారణంగాను, సా మాన్యులకు **'రంగస్థలం'**పై






ప్రతులకు:
డా॥ ఆచార్య ఫణీంద్ర
శ్రీకరం, 6-34/48/1
దుబాయి బిల్డింగ్ ఎదురుగా
దమ్మాయిగూడ,
హైదరాబాద్-500083
సెల్: 99598 82963
98499 09896

వీనుల విందు కలిగించిన ఈ పద్యాలను గుర్తు చేసుకోవటం కవిత్రయానికి నమ్రతతో తలవం చటమే. **"నీసానికి నన్నయ నడకలు నేర్పారని"** ప్రశంసించిన ఆచార్య ఫణీంద్ర ప్రాచీన పద్య కవితలను సార్వ కాలీన సామాజిక సందేశంగా, ఆధునిక ఆలోచనా దృక్పథంతో వ్యాఖ్యానించి పండితు లను కూడా పరవశింపచేసే విశిష్టతను వ్యక్తీకరించారు. తెలుగు సాహితీ ప్రపంచానికి, అణు ఇంధన శాస్త్రవేత్త అయిన డా॥ ఫణీంద్ర **'తెలుగు కవిత్వంలో నవ్యత"** అనే భావ్యాంశంపై పి.హెచ్‌డి. పొందటం, ఆచార్య ఫణీంద్రగా ఆణిముత్యాల వంటి పద్యాల భారతభారతిని అనుభవింపచేయడం అభినంద నీయం. మహాభారతంలోని శతా బ్దాల కాలం నాటి ఆ పద్యాలు, ఏ విధంగా మనోహరమైన ఆధు నిక వర్ణచిత్రాలుగా రూపుదిద్దు కొంటునదీ, నేటికీ కళ్ళకు కట్టే పాత్రలుగా ఆహార్య అభినయ విశేషాలతో జన సామ్యాన్ని అల రిస్తున్నదీ, వీనుల విందుగా పామ రలోకాన్ని వినటం వలన పరవ శింప చేస్తున్నదీ లోకహితం ఆకాంక్షిస్తూ మహాభారత సంహి తాన్ని రచించేందుకు ఉపక్రమిస్తూ నన్నయ **'సారమతిం కవీంద్రులు"** లో వివరించిన ప్రశంస, **'భారత భారతి'**కి చెల్లుతుంది. యువ భారతి ప్రచురణ అయిన ఈ కవిత్రయ మహాభారత పద్యమ ణుల హృద్య వ్యాఖ్యను విద్యార్థి లోకానికి పాఠ్యాంశంగా విద్యాలయాలలో ప్రవేశ పెట్టడం ఎంతైనా ప్రస్తుతం ప్రశస్తనీయం.

పౌరాణిక యుగాన్ని ప్రతిబింబింపచేసే ప్రాచీనతను నిర్ద్వం ద్వంగా నిరసించటం కంటే ప్రజా స్వామ్య యుగంలో వ్యక్తి స్వేచ్ఛ నిర్దేశించే మహా భారత నీతి సూత్రాన్ని జౌదల దాల్చటం ద్వారా సమాజంలో శాంతిని పెం పొందింప చేయ టం అవసరమని, 'భారత భారతి' స్పష్టం చేస్తోంది. తిక్కన విరచిత **"ఒరులేయవని యొనర్చిన"** శాంతి పర్వంలోని పంచమా శ్వాసం లోని పద్యాన్ని ఉత్కృష్టమైన నీతి సూత్రాన్ని ఎప్పుడో 12వ శతాబ్దం లో తిక్కన తెలియ చెప్పటం వంటి మచ్చు తునకలు ఈ భారత భారతిలో డా॥ ఆచార్య ఫణీంద్ర ప్రస్తుత 21వ శతాబ్ది స్థితిగతుల లో పాఠక లోకానికి అందిం చటం అభినం దనీ యం. యువ భారతి వ్యవస్థా పక విఖ్యాతులు డా॥ వంగపల్లి విశ్వనాథం గార్కి భారత భారతి అంకితంగా ఇవ్వ టం ఎంతైనా సమాద రనీయ సమ్మదం.


-జయసూర్య
సెల్:9440664610

# ఘనంగా అత్తలూరి విజయలక్ష్మి సాహితీ స్వర్ణోత్సవం



అత్తలూరి విజయలక్ష్మిని సన్మానిస్తున్న ఆంధ్రప్రదేశ్ సంస్కృత, తెలుగు అకాడమీ చైర్మన్ శరత్‌చంద్ర, ఓలేటి పార్వతీశం, ఎం.వి.రామిరెడ్డి, వంశీరామరాజు,డా॥.వి.ఎన్.ఆదిత్య తదితరులు

హైదరాబాద్, డిసెంబర్ 10: ప్రముఖ కథా, నవలా, నాటక రచయిత్రి, స్వర్ణోత్సవ సాహితీ విద్వన్మణి అత్తలూరి విజయలక్ష్మి సాహితీ స్వర్ణోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా సాహితీ సామ్రాజ్ఞి బిరుదును ప్రదానం చేశారు. వంశీ ఆర్ట్ థియేటర్స్ లేఖిని రచయిత్రుల వేదిక సంయుక్త ఆధ్వర్యంలో శనివారం త్యాగరాయ గానసభలో నిర్వహించిన కార్యక్రమం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు కోలా హలంగా, అట్టహాసంగా జరిగింది. సాయంత్రం జరిగిన సభా కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ సంస్కృత, తెలుగు అకాడమీ చైర్మన్ శరత్‌చంద్ర మాట్లాడుతూ సాహిత్యంలో కృషి చేస్తూ అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన మహిళా రచయిత్రి అత్తలూరి విజయలక్ష్మి అన్నారు. ఆమె సాహితీ స్వర్ణోత్సవం జరుపుకోవడం ఎంతో గొప్ప విష యం అన్నారు.

అధ్యక్షత వహించిన ప్రముఖ సాహి తీవేత్త డా॥ఓలేటి పార్వతీశం మాట్లాడుతూ రచ యిత్రి అత్తలూరి విజయలక్ష్మి కథలు, నవలలు, రేడియో, టీవీ నాటకాలు ఎంతో అద్భుతంగా రాశారన్నారు. అనంతరం వంశీ రామరాజు మాట్లాడారు. కార్యక్రమంలో రాంకీ ఫౌండేషన్ అధ్యక్షుడు ఎం.వి.రామిరెడ్డి, ప్రముఖ సినీ దర్శకుడు డా॥.వి.ఎన్. ఆదిత్య సంగీత నాటక అకాడమీ పురస్కార గ్రహిత డా॥దీర్ఘాసి విజయభాస్కర్, రంగస్థల నటులు రామకోటేశ్వరరావు, శైలజ సుం కరపల్లి, సరస్వతి, శ్రీలక్ష్మి, నాగలక్ష్మి, దుర్గ, కామే శ్వరి, సుధామ, నాగమణి, నాగలక్ష్మి, కృష్ణకుమారి, కస్తూరి, జానకి, చెన్నయ్య, విహారి, భానుమతి, ఉమాదేవి, మణి, రేణుక, సర్వమంగళగౌరి, జి.ఎస్.లక్ష్మి, బాలామూర్తి పాల్గొన్నారు.

# అమెరికాలో మెరిసిన తెలుగు అక్షరం వేణు నక్షత్రం



కవిత్వం కథ నవల వ్యాసం నాటిక సినిమా వంటి వివిధ సాహిత్య రంగాలలో వేణు నక్షత్రం చురుకుగా పనిచేస్తున్నాడు. సుమారు 35 సంవత్సరాలుగా ఆయన కథ రచనలలో ప్రసిద్ధుడు. సిద్దిపేట లో జన్మించాడు. సిద్దిపేటలోనే విద్యాభ్యాసం పూర్తి చేశాడు. ఉద్యోగార్థం అమెరికాకు వెళ్ళినప్పటికీ, తెలంగాణ ఆత్మను ప్రతిబింబించే పలు రచనలు చేశాడు. బహుముఖీనంగా రాణిస్తున్న రచయిత. రచయితల సంఘ నిర్వహణ, సంస్థల నిర్వహణలోనూ సాహిత్య సేవలు అందిస్తున్నాడు. డయాస్పోరా రచనలు చేశాడు. 2019 లో వాషింగ్టన్ డి.సి లో జరిగిన తానా మహాసభల సందర్భంగా సాహిత్య విభాగం చైర్‌గా పలు కార్యక్రమాలు నిర్వహించి శభాష్ అనిపించుకున్నాడు. ఈ దశాబ్దిలో అమెరికా తెలుగు అసోసియేషన్- ఆటా సభలు నిర్వహించటం తన సాహిత్య ప్రయాణంలో మరపురాని సందర్భంగా, తెలుగు భాష పట్ల గల అపూర్వమైన ప్రేమకు చిహ్నంగా భావించే అతని సాహిత్య సేవా తత్పరతకు గుర్తుగా ఇండియాలో నెల రోజులు పాటు జరిగే "ఆటాడేస్" కార్యక్రమ నేపద్యంలో జరిగే సాహిత్య కార్యక్రమాన్ని డిసెంబర్ 14 న, తెలుగు విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న వేణు నక్షత్రంతో ముఖాముఖి :

● మీ బాల్యం,విద్యాభ్యాసం ఎక్కడ జరిగింది?

○ బ్యాచిలర్స్ డిగ్రీ వరకు సిద్దిపేటలో విద్యాభ్యాసం. ఆ తర్వాత ఉస్మానియా నుండి ఎం సి.ఏ చేసి వెంటనే అమెరికాకి వెళ్ళిపోయాను 1998 లో.

● బాల్యంలో మిమ్ములను ప్రభావిత పరిచిన సంఘటనలు ఉన్నాయా?

○ సమాజంలో లో జరిగే ప్రతి సంఘటన నన్ను ప్రభావితం చేసేది. నేను సాహిత్యం కన్నా సమాజాన్నే ఎక్కువ చదివాను. నేను చూసిన సంఘటనలు, నన్ను ప్రభావితం చేసిన అంశాలే నా సాహిత్య (కథ లేక కవిత,నవల) ల అంశాలు .

● విద్యార్థి దశలో ఏ ఉద్యమంలో ఉన్నారు? ఏ సంస్థలలో ఉన్నారు?

○ విద్యార్థి దశలో సిద్దిపేట కాలేజీ లో "చైతన్య విద్యార్థి వేదిక" అనే క్రొత్త సంస్థను స్థాపించి కళాశాలలో ఎన్నో కార్యక్రమాలు, ఉద్యమాలు, విద్యార్థులకు ఉపయోగకరమైన ఎన్నో ప్రభుత్వ విద్యార్థి పథకాలు అవసరమైన వారికి అందుబాటులో ఉండేట్టు చూసాము. ముఖ్యంగా నిరుపయోగంగా పడివున్న " కాలేజీ ఎయిడ్ ఫండ్" ద్వారా పేద విద్యార్థులకు, ఆరోగ్య సమస్యలు ఉన్న విద్యార్థులకు ఉపయోగ పడేట్టు చేసాము.

● మీరు నాటకాలు రాయడం చేశారు కదా ఎప్పటినుండి రాస్తున్నారు ఆ నాటకాల పేరు ఏమిటి?

○ కాలేజీ వార్షికోత్సవం కోసం రాసిన నాటకం "పగటి చుక్కలు", "కౌముది" కథని డ్రామాగా వాషింగ్టన్ లో ప్రముఖ యూట్యూబ్ నిర్వాహకులు లక్ష్మి గారు ఆడియో రూపంలో అందించారు.

● మీరు రాసిన ప్రారంభ కాలం నాటి కథలు ప్రచురితమయ్యాయా!ఎక్కడ ప్రచురిం చబడ్డాయి?

○ ఆంధ్రజ్యోతి ఈ వారం కథలో "పర్యవసానం" 1993 , మౌనసాక్షి సుప్రభాతం పక్ష పత్రికలో (1993) ప్రచరించబడ్డాయి. కొన్ని కవితలు కూడా రాసాను. 1990 లలో స్పందన అనే మెదక్ జిల్లా యువ కవులతో వేసిన సంకలనం లో నావి కొన్ని కవితలు ప్రచురించబడ్డాయి . ఆ తర్వాత అప్పుడప్పుడూ కొన్ని పత్రికలలో అచ్చు అయ్యాయి. ప్రభుత్వ అధికారులు నిర్ల క్ష్యంగా వదలిన మూసీ వరద వృద్ధితిలో కొట్టుకుపోయిన రజక దంపతుల సంస్మరణలో ఆంధ్ర ప్రభలో "మృత్యుహేళ" మంచి పేరు తెచ్చింది.

● సినిమా రంగంలో మీరు చేస్తున్న కృషి గురించి చెప్పండి?

○ అమెరికా వెళ్లిన తర్వాత క్రొత్త ఉద్యోగం, క్రొత్త బాధ్యతలు నన్ను ఉక్కిరి













బిక్కిరి చేశాయి. దాదాపు ఒక దశాబ్దానికి పైగా సాహిత్యం వైపు వెళ్ళలేదు. చిన్నప్పటి నుండి సాంస్కృతిక రూపాల పట్ల ఆసక్తి ఉండేది నాకు. ప్రముఖ హాలీవుడ్ నటుడు రస్సెల్ క్రోవ్ సినిమా వాషింగ్టన్ డి.సి లో షూటింగ్ జరుగుతున్నప్పుడు సరదాగా జూనియర్ ఆర్టిస్ట్ గా వెళ్లిన నేను , అప్పటినుండి సినిమాలు తీయాలనే ఉత్సాహం నాలో మొదలయ్యింది. అన్ని మాధ్యమాల్లోకి సినిమా అనేది చాలా పవర్ఫుల్ కాబట్టి మనం చెప్పదలచుకుంది సినిమా ద్వారా అయితే సూటిగా ప్రజల్లోకి వెళుతుంది అని సినిమా నిర్మాణం మొదలు పెట్టాను. అన్ని కోర్సులు చదివి, మొదటి సారిగా తీసిన లఘు చిత్రం "ఎంతెంత దూరం" బాగా పేరు తేవడమే కాక, రవీంద్ర భారతి "సినీవారం" నా లఘు చిత్రాలతో ప్రారంభం కావడం నా లోని సినీ దర్శకుడికి దక్కిన మొదటి జీవిత కాలపు మధుర జ్ఞాపకం. ఆ తర్వాత మరికొన్ని లఘు చిత్రాలు, ఇటీవల 'అందె లరవమిది' అనే ఫీచర్ ఫిలిం చేసాను, ఇప్పుడు , ఆటాడిన పాట అనే ఇంకొక ఫీచర్ ఫిలిం నిర్మాణ పనులు నడుస్తున్నాయి.

● ఇప్పటివరకు ఏ ఏ పుస్తకాలు రాశారు? ఏవి ప్రచురించబడినవి?

○ మౌనసాక్షి, అరుగు కథ సంపుటులు, శ్రీగీతం నవల. అతి త్వరలో నా కథలు ఆంగ్ల అనువాదం "Snowy Whispers of the Soil" అనే పుస్తకం రాబోతుంది.

● ఇటు ఉద్యోగం మరొకవైపు సినిమా రంగం అలాగే అమెరికాలో స్థానిక సాహిత్య సంస్థలతో కలిసి ఉండటం ఇంత బిజీ పనులలోను ప్రతి సోమవారం మీరు నిర్వహించే కవి వారం కవి సమ్మేళనంలో పాల్గొంటున్నారు.రచయితల నిర్మాణానికి ఎలా దోహదమవుతుంది?

○ మూడు సంవత్సరాల క్రితం 'తెలంగాణ రచయితల సంఘం' ఆధ్వర్యంలో మొదలయిన "సోమవారం కవి సమ్మేళనం" ఇప్పటికే ఎందరో క్రొత్త కవులకి ఒక మంచి వేదిక అయ్యింది. మూడు సంవత్సరాల క్రితం సాహిత్య లోకంలో ఎవరికీ తెలియని చాల మంది కవులు, రచయితలు ఇప్పటికే ఎన్నో పుస్తకాలూ ప్రచురించడమే కాకుండా ఎన్నో వేదికల మీద అతిథులుగా కనిపిస్తున్నారు. సినీయర్ రచయితల సలహాలు క్రొత్త వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటున్నాయి.

● డిసెంబర్ 14న ' వినోద్ కుమార్ శుక్లా గారి సాహిత్య సమాలోచన వివరాలు తెలుపుతారా? తెలుగులో ఎందరో ప్రముఖ కవులు ఉండగా హిందీ రచయితను పరిచయమ చేయడం ఎంతవరకు సబబు?

○ అంతర్జాతీయ తెలుగు సంఘాల్లో బహు ప్రాచుర్యం పొంది, తెలుగు సాహిత్యం, భాష పట్ల అభిమానంతో పని చేస్తున్న సంస్థ "అమెరికా తెలుగు సంఘం" సాహిత్య విభాగం అధ్యక్షునిగా బాధ్యతలు స్వీకరించినప్పుడు, ఎప్పుడూ రొటీన్ గా చేస్తున్న సభలు కాకుండా ఏదైనా క్రొత్తగా చేయాలనే ఆలోచన వచ్చినప్పుడు , వినోద్ కుమార్ శుక్ల గారి ప్రస్తావన ఆటా కార్యవర్గం కి బాగా నచ్చింది. వారిచ్చిన ప్రోత్సాహంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాను.

మేము ఇప్పటికే ఫ్లయర్ చెప్పిన వాక్యాలు "అమెరికా తెలుగు అసోసి యేషన్ లో తెలుగేతర శక్తిని పరిచయం చేస్తూ కొత్త ఒరవడి తీసుకురావడంలో ప్రధానోద్దేశం మునుముందు మన తెలుగు తేజాలకు పర భాషల్లో పర ప్రాంతాల్లో వెలుగులీనే అవకాశానికి నాంది పలుకుతూ, ఈ సత్సంకల్పాన్ని స్వాగతిస్తూ ప్రోత్సహిస్తారని ఆశిస్తూ" ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాను. ఎందరో క్రొత్త రచయితలకి వినోద్ కుమార్ శుక్ల గారి రచనలు ప్రభావితంగా ఉంటాయి ఎందుకంటే ఆయన రచనల్లో అన్ని సామాజిక, సాధారణ అంశాలే ఉండటం విశేషం. ఆ అంశాలతోనే రాసిన రచనలకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు, 2024 జ్ఞానపీఠ్ అవార్డు లభించడం ఇక్కడ ప్రత్యేకంగా చెప్పుకో వాలి. ఒక అవార్డు, లేదా సమాజంలో ఒక రచయితగా గుర్తింపు రావాలి అంటే ప్రభందాలు చదవాల్సిన అవసరం లేదు, సమాజాన్ని నిశిత దృష్టితో పరిశీలించి ఒక క్రొత్త కోణంలో రాసినప్పుడు ఏ రచన అయినా ప్రజాధరణ పొందుతుంది అని నిరూపించిన రచనలు శ్రీ శుక్లా గారి రచనలు, అందుకే ఈ రచనలు ఖచ్చి తంగా రాబోయే రచయితలపై ప్రభావం చూపుతాయి అనే ఉద్దేశ్యం తో ఈ సభలు నిర్వహిస్తున్నాము. ఇప్పటికే ఈ ప్రయత్నానికి మంచి స్పందన లభిస్తుంది.

2023 లో జరిగిన ఆటాడేస్ సాహిత్య విభాగం కార్యక్రమం కూడా నా నిర్వహణలో 40 మందికి పైగా అన్ని సాహిత్య రంగాల్లో లబ్దప్రతిష్టులు అయిన కవులు, రచయితలూ, పాత్రికేయులతో సూర్యోదయం నుండి సూర్యాస్తమయం వరకు జరిగిన కార్యక్రమం పలువురిని ఆకర్షించింది. " ఒక యూనివర్సిటీలో సంవత్సర కాలం నేర్చుకున్న విభిన్న సాహిత్య అంశాలు ఒక్క రోజులో నేర్చుకోవడం జరిగింది ఈ కార్యక్రమం లో" అని ప్రముఖ సాహితీ వేత్త , వేమన విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ శ్రీ తప్పెట రామకృష్ణారావు గారు ప్రశంసించడం ఒక గొప్ప అనుభూతి.

అందరూ ఈ డిసెంబర్ 14 న సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యా లయం లో జరిగే జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత శ్రీ వినోద్ కుమార్ శుక్ల గారి సాహిత్య సమాలోచన కార్యక్రమం, వారు చూపిన సాహిత్య బాట వివరాలు తెలుసుకుంటే, మన బావి తరాలకి కొంత వరకు ఉపయోగపడవచ్చు అనే ఉద్దేశం

● ఈ సభల నుండి రాబోయే తరానికి ఏ సందేశం ఆశించవచ్చు?

○ బలహీనుల పక్షాన నిలబడి రచనలు చేయాలి. సాహిత్యం సామాన్యులకు చేరాలి. విలువలు పెంపొందించడానికి సమాజానికి ఉపయోగ పడాలి, సామాజిక ప్రయోజనం నెరవేరాలి.



-ఇంటర్వ్యూ: రాధికసూరి




అమెరికా తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆటా అంతర్జాతీయ సాహితీ సదస్సు-2023లో పాల్గొన్న అతిథులతో...

# భావితరాలకు చరిత్ర అవసరం



జాజుల గౌరి రచించిన "భారత దేశ బొగ్గు గనుల చరిత్ర చట్టాలు- ప్రజలు -సంక్షేమ పర్యావరణం" గ్రంథావిష్కరణలో యశోద, జ్వలిత, ఆడేపు లక్ష్మీపతి, బైస దేవదాసు. బి.నర్సింగ్‌రావు, బి.యస్.రాములు, రచయిత్రి జాజుల గౌరీ, డా॥నామోజు బాలాచారి, జూపాక సుభద్ర, రహమాన్, రాధాకుసుమ తదితరులు

చరిత్రను రికార్డు చేసినప్పుడే భావి తరాలకు ఎంతో ఉపయుక్తంగా వుంటుందని తొలి బి.సి.కమీషన్ చైర్మన్ బి.యస్.రాములు అన్నారు. సోమవారం రవీంద్రభారతిలో జాజుల గౌరి రచించిన "భారత దేశ బొగ్గు గనుల చరిత్ర చట్టాలు- ప్రజలు -సంక్షేమ పర్యావరణం" గ్రంథాన్ని ముఖ్య అతిథులుగా బి.యస్.రాములు, బి. నర్సింగ రావులు పాల్గొని ఆవిష్కరించారు. బి.యస్.రాములు మాట్లాడుతూ.. సి.సి.యల్ ఇండిపెండెంట్ డైరెక్టర్ (సెంట్రల్ కోల్డ్ ఫీల్డ్ లిమిటెడ్-జార్ఖండ్ రాష్ట్రం) గా ప్రభుత్వం నామినేట్ చేసిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని బొగ్గు గనులపై పరిశోధన చేసి ఆ ప్రాంత పరిస్థి తులను అవగాహన చేసుకుని బొగ్గు గనుల ప్రయోజనం, పర్యావరణం, చట్టాల గురించి చాలా వివరాలను ఎంతో కృషి చేసి వ్రాసిన ఈ గ్రంథం ఎంతో విలువైనదని అభినందించారు. మనకు తెలియని విషయాలు ఎన్నో ఈ గ్రంథంలో వున్నాయని ఎంతో ఉపయుక్తమైనదని వివరించారు. ఇలా ప్రతి రంగం గురించి సవివరమైన చరిత్ర పుస్తకాలు రావలసిన అవసరం ఎంతైనా వుందని అన్నారు. జాజుల గౌరీ రచనలను విశాల సాహితీ ద్వారా వెలువరించి ప్రోత్సహించామని తెలిపారు. ప్రఖ్యాత దర్శకుడు, నటులు బి. నర్సింగరావు మాట్లాడుతూ.. భారతదేశంలో బొగ్గు గనులు ప్రధాన భూమిక పాత్ర అని ఆదాయ వనరులతో పాటు ప్రజల అవసరాలు తీరుస్తున్నాయని, నిరుపేద కుటుంబంలో జన్మించి కష్టపడి ఉన్నత చదువులు చదివి సమాజస్థితి గతులపై చైతన్యవంతమైన రచనలు చేస్తున్న జాజులగౌరిని కొనియాడారు. ఈ గ్రంథం కూడా అషామాషిది కాదని ఎన్నో అం శాలను కుప్తంగా వివరిం చారని అన్నారు. సభాధ్యక్షులు తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి డా॥నామోజు బాలాచారి మాట్లాడుతూ... కవులకు రచయితలకు పుస్తకావిష్కరణలను అకాడమీ అండదండలు అందిస్తోందని పుస్తక పరిచయ సభలను కూడా నిర్వహిస్తోందని తెలిపారు. మహిళలకోసం ప్రతి నెల ప్రత్యేకంగా ఒక సాహిత్య సభ నిర్వహించడానికి అవకాశం




రచయిత్రి జాజులగౌరిని సత్కరిస్తున్న అతిథులు..

కల్పిస్తామని, ఈ రోజు ఆవిష్కరించబడిన జాజుల గౌరీ గారి గ్రంథంలో మనకు తెలియని విషయాలెన్నో వున్నాయని, బొగ్గు గనులపై ఆమె పరిషోధనను అభినందించారు.

నేటినిజం దినపత్రిక సంపాదకలు బైస దేవదాసు మాట్లాడుతూ.. 8వ తరగతిలోనే పెళ్ళి కావడం, ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొని భర్త సహకారంతో ఉన్నత చదువులు చదివి గొప్ప మహిళగా, మంచి రచయిత్రిగా గుర్తింపు పొందిన జాజులగౌరిని అభినందించారు. ఇష్టపడి కష్టపడితే సాధించలేనిది ఏదీ లేదని నిరూపించారు. బొగ్గు గనుల్లో పని చేసే వారిపై ఎన్నో కథలు, నవలలు వచ్చాయని ఆ కార్మికుల కష్టాలు చదువుతుంటే కన్నీళ్ళు వస్తాయని అన్నారు. అలాంటి బొగ్గు గనులపై ఎంతో పరిశోధన చేసి తెలియని విషయాలు తెలిపి వాటి ప్రాముఖ్యతను, అవసరాలను అక్షర రూపంలో అందించిన జాజుల గౌరిని అభినందించారు.

అణగారిన వర్గాలను ఈ సమాజం ఇంకా అణచివేస్తూనే వుందని, నిలదీస్తేగాని పరిష్కారం దొరకడం లేదని జనంసాక్షి దినపత్రిక సంపాదకులు రెహమాన్ ఆగ్రహం వ్యక్తపరిచారు. పాకీ పనులు, డ్రైనేజీపనులు కొన్ని వర్గాల వాళ్ళే చేస్తే సమానత్వం ఎలా వస్తుందని మిగతా వర్గాల వాళ్ళు ఆ పనులు ఎందుకు చేయరని నిలదీశారు. జాజుల గౌరి పరిశోధనా గ్రంథంలోని అంశాలు కనువిప్పు కలిగేలా వున్నాయని బావితరాలకు చరిత్ర ఎంతో అవసరమని పాఠ్యపుస్తకాల్లో అందిస్తే విద్యార్థులకు జ్ఞానాన్ని అందించే విధంగా వుంటుందని అన్నారు. ప్రముఖ రచయిత్రి జూపాక సుభద్ర మాట్లాడుతూ తమ కుటుంబ జీవితమంతా బొగ్గు గన్నుల్లోనే గడిచిపోయిందని నల్లటి దుమ్ము దూళిలో గడిపిన క్షణాలను గుర్తు చేసుకున్నారు. అప్పట్లో కార్మికులు గనుల్లో పనికి వెళ్తే తిరిగి వస్తారో రారో అని బెంగ పెట్టుకునే వారని వసతు లు సరిగా లేకున్నా కడుపు తిప్పలకి పని చేయక తప్పని పరిస్థి తులని వివరించారు. అలాంటి బొగ్గు గనులపై పరిశోధించి గ్రంథాన్ని వెలువరించిన జాజుల గౌరిని అభినందించారు. "మన్ను బువ్వ"కథా సంకలనం, 'వాయనం' నవల, "చెట్టునీడ" కథా సంకలనం వెలువరించి తన ప్రతిభను చాటుకున్నారని, ఇపుడు ఈ గ్రంథంతో మరింత ఎత్తుకు ఎదిగారని అన్నారు. రచయిత, విమర్శకులు ఆడెపు లక్ష్మీపతి మాట్లాడుతూ.. బొగ్గు గనుల్లో పని చేసే కార్మికులు, అధికారుల విధి విధానాల గురించి క్లుప్తంగా వివరించారు. తమ కుటుంబం కూడా బొగ్గు గనుల్లో పని చేసిన కార్మికులేనని అరచేతిలో ప్రాణం పెట్టుకుని పని చేసేవారని ఆనాటి పరిస్థితుల గురించి వివరించారు. జాజుల గౌరి గ్రంథస్థం చేసిన ఈ గ్రంథం పాఠ్య పుస్తకాల్లో ప్రవేశపెడితే విద్యార్థులకు ఎంతో మేలు చేసిందవుతుందని అన్నారు.

బహుళ త్రైమాసిక పత్రిక సంపాదకులు జ్వలిత మాట్లాడుతూ... బొగ్గు గనుల్లో పని చేసే కార్మికుల కష్టాలను విపులంగా వివరించారు. ఈ గ్రంథం ప్రతి ఒక్కరు చదువదగ్గదని, ఎన్నో విషయాలు తెలుస్తాయని అన్నారు.

గ్రంథకర్త జాజులగౌరి మాట్లాడుతూ... సి.సి.యల్. ఇండిపెండెంట్ డైరెక్టర్‌గా ప్రభుత్వం నామినేట్ చేయడం వల్ల సమాచార సేకరణకు అనేక సార్లు ఝార్ఖండ్ బొగ్గు గనుల రైతులని, మహిళలను, కార్మిక సంఘాలను, కార్మిక నాయకులని, కార్మికులని, అక్కడి విశ్వ విద్యాలయాలని, స్కూల్స్‌ని, అనేక గ్రామాలని సందర్శించడం జరిగింది. నేను చూసి తెలుసుకున్న విషయాలు ప్రజలకు, అధికారులకు తెలియపరచగలిగితే మరిన్ని జాగ్రత్తలు తీసుకుని దేశ భవిష్యత్తుకు కృషి జరిగే అవకాశం వుంటుందని గ్రంథస్తం చేశానని అన్నారు. రైతు బిడ్డగా, ఐదు రూపాయల కూలీగా బతికిన నాకు కుటుంబం అందించిన సహకారంతో బి.యస్.రాములు, బి.నర్సింగ్‌రావుల ప్రోత్సాహంతో, మిత్రుల అండ దండలతో ఈ స్థాయికి చేరు కోగలిగానని తనకు వెన్ను దన్ను గా వున్న అందరికీ ధన్యవాదాలు తెలిపారు.

సభా ప్రారంభంలో డా॥ రాధా కుసుమ నిర్వహణలో జరి కవి సమ్మేళనంలో మిద్దే సురేష్, కడియం సోమన్న, బి చంద్రశేఖర్ శర్మ, కట్టా శ్యామలాదేవి, విజయ్‌కుమార్, రమాదేవి బుక్కపట్నం,ఝాన్సీ ముదుంబై, కాదంబరీ కృష్ణ ప్రసాద్, దేవ దానం, లయన్ మేడిశెట్టి వెంకటే శ్వర్లు, డా॥ నాగేశ్వరరావు, కోదాటి అరుణ, ఏలే సంతోష్ కుమార్, టి.వి మాణిక్యలక్ష్మి, డివిఎస్ఎస్ ప్రసా ద్, బీహెచ్ఈ ఎల్ హరి ప్రసాద్, కృష్ణం శెట్టి సుబ్బారావు, గూండ్ల నారాయణ, శరణ్య, ఇంద్రాణి, జాజుల గౌరీ, అనంతాత్ముల శ్రీనివాస్, అవుసలి ఆంజనేయులు, రఘు రాములు గౌడ్ పాల్గొన్నారు.

## ఉన్నచోటే జీవితం

మాయలేని ఎంత అమాయకత్వం
కొండంత కోటా రావాల్సి ఉన్నా
ఇచ్చిన వాటా తోనే సర్దుబాటు
చారానా ఆశ చూపించి
బారానా లాక్కొన్నా యధాలాపం

నేడు గడిస్తే చాలనే సగటు జీవి
రేపటి రోజుపై దృష్టి కరువే
తనలో దాగివున్న సత్తా గుర్తించక
పరాన్నజీవులుగా మారి పరులకు
జవ"జీవాలు' అందించే వారైనారు

అమాయకుల ఆసరాతో ఆడుకొని
అందలం ఎక్కే వారే ఎందరెందరో
ఉన్న చోటే ఉన్నట్లే జీవితాలు



-పత్తి శివప్రసాద్
9440001224

## కవి పండితులు, విద్యావేత్త సీఆర్‌రెడ్డి: వక్తలు



సీఆర్ రెడ్డికి నివాళులర్పిస్తున్న మల్లం రమేష్, భవిరి రవి, పొత్తూరి సుబ్బారావు,.. కళా జనార్ధనమూర్తి, గాయని లక్ష్మిశాంతి

హైదరాబాద్, డిసెంబర్ 10:కట్టమంచి రామలింగారెడ్డి (సీఆర్‌రెడ్డి) కవి, పండితులు, విద్యావేత్త అని వక్తలు కొనియా డారు. త్యాగరాయ గానసభ ఆధ్వ ర్యంలో జరుగుతున్న ఎందరో మహానుభావుల మధురస్మృతు లలో భాగంగా శుక్రవారం కట్ట మంచి రామలిం గారెడ్డి యాది లో సంస్మరణ సమావేశంలో గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జనార్ధనమూర్తి మాట్లాడుతూ 1880లో చిత్తూరు జిల్లా కట్ట మంచిలో జన్మించిన సీఆర్ రెడ్డి కేంబ్రిడ్జి యూనివర్సిటీలో ఉన్నత విద్యాభ్యాసం పూర్తిచేసి జాతిసేవ కు తిరిగి వచ్చారని 19 ఏళ్ల వయస్సులోనే ముసలమ్మ మర ణం ఖండకా వ్యం రచించి ప్రథమ బహుమతి పొందారన్నారు. ప్రతి ఊరికి ఒక పాఠశాల ఉద్యమం ప్రారంభించిన ఘనత సీఆర్‌రెడ్డి దేనన్నారు. ప్రముఖ రచయిత పొత్తూరి సుబ్బారావు ప్రసంగిస్తూ విద్వాంసుడు పురస్కారం అందుకున్న రామలింగారెడ్డి 1905లో, కేంబ్రిడ్జి యూనివర్సిటీలో యూనియన్ లిబర్ క్లబ్ కార్యదర్శిగా ఎన్నికై ఆంగ్లేయుల మన్ననలు అందుకున్నారని గుర్తు చేశారు. మైసూరు విద్యాశాఖలో ఇన్‌స్పెక్టర్ జనరల్‌గా పనిచేశారని వివరిం చారు.

మద్రాస్ శాసనసభలో సభ్యుడుగా ఉన్న సీఆర్‌రెడ్డి ఆంధ్ర విశ్వవిద్యాలయం స్థాపక వీసీగా కీలకపాత్ర పోషించారని గుర్తు చేశారు. మిమిక్రీ కళాకారులు మల్లం రమేష్, భవిరి రవి, గాయని లక్ష్మిశాంతి పాల్గొన్నారు.

## కవిత్వం సాహిత్య కళారూపకం: నర్సింగ్‌రావు



'ఏకాంతం ఒక అతిథి' కవిత పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఏలే లక్ష్మణ్, బి.నర్సింగ్‌రావు.

హైదరాబాద్, డిసెంబర్ 10:ఆనాడు నాటకం కళారూప కంగా నిలబడగా నేడు కవిత్వం సాహిత్య కళారూపకంగా నిలబ డుతుందని ప్రముఖ సినీ దర్శ కుడు బి.నర్సింగ్‌రావు అన్నారు. సాహిత్యంలో కవిత్వం భాగమైన పుడు నిగూఢత లేకపోతే అది నిల బడలేదన్నారు. ఆదివారం రాత్రి బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో పసునూ రు శ్రీధర్‌బాబు రచించిన ఏకా ంతం ఒక అతిథి కవిత పుస్తకాన్ని ప్రముఖ చిత్రకారుడు ఏలే లక్ష్మణ్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం లో పాల్గొన్న బి.నర్సింగ్‌రావు మాట్లాడుతూ, కవిత్వం ఒక వ్యస నం వంటిదని, అందులో దిగిన వారు బయటకు రావడం కష్ట మన్నారు.

కళాత్మక మైన విలువలు తెలి సిన కవి శ్రీధర్‌బాబు అని కొనియాడారు. తెలుగులో కవిత్వం రాసేవారు చాలా మంది ఉన్నారని, వారు బయటి ప్రపం చాన్ని పట్టించుకోరని అన్నారు.

తెలంగాణ అస్తిత్వ ధోరణిలో వస్తున్న కవితలో శ్రీధర్‌బాబుది డిఫరెంట్ ధోరణి అని భిన్నమైన శైలిలో కవిత్వాన్ని అందిస్తున్నారని అన్నారు. ప్రముఖ చిత్ర కారుడు ఏలే లక్ష్మణ్ మాట్లాడు తూ, అద్భుతమైన కవిత్వాన్ని సమాజానికి అందించారని అన్నారు. ప్రొఫెసర్ పిల్లలమర్రి రాములు మాట్లాడు తూ, న్యాయవాదిగా కొనసాగడం ఇష్టం లేక రచనలపై ఆసక్తితో జర్నలిజంలోకి శ్రీధర్ బాబు అడుగుపెట్టారని అన్నారు. కార్యక్రమంలో రచ యిత్రి విమ ల, రచయిత సిద్దార్థ, కవి ప్రసాద మూర్తి, శ్రీధర్‌బాబుపాల్గొన్నారు.

## ఓటు..విలువ తెలుసుకో.!

ప్రజాస్వామ్య వృక్షం
పచ్చగ ఉండాలంటే
ఓటు అనే వాటర్
పోయాలి ప్రతి ఓటర్.
నోటుకు వేయకు ఓటు
ప్రజా స్వామ్యనికి చేటు
నోటుకు మురిసిపోకు ఓటర్
ఓటును అమ్ముకోకు ఓటర్.

ఓటును అమ్ముకుంటే
నీకు ఒక్కరోజే సంతోషం
ఓటును కొనుకున్న వాడికి
ఐదు సంవత్సరాలు సంతోషం.
నేతల తల రాతల్ని
మార్చే విధాత ఓటర్

నాయకుల పదవీ కిరీటాన్ని
పడగొట్టే బాహుబలి ఓటర్.
ఓటు విలువ గుర్తించు ఓటర్
ప్రజా స్వామ్యాన్ని రక్షించు
ధూర్త పాలకులను శిక్షించు
ఓటు బలాన్ని చూపించు ఓటర్.

ఓటు ప్రజాస్వామ్యానికి
ప్రాణవాయువు ఓటర్
ఓటువేసి వేలిపై చుక్కనిచూపి
గర్వపడాలి ప్రతి ఓటర్



- బూర దేవానందం
8143589789.

# నిత్య సచేతన సాహితీ దీప్తి డా॥ లావణ్య








-ఎస్.వి.సత్యనారాయణ
09618032390

> ‘సాహిత్యం ఆమెకు హాబీ కాదు, అభిరుచి. వ్యవహారం కాదు, వ్యసనం. వెనుకతరముల వారి దేశభక్తిని, సామాజిక నిబద్ధతను, సాహితీపిపాసను తెలుసుకుంటూ ఉత్తేజం పొందడంతో సంతృప్తి చెందకుండా; నేటి తరానికి తెలియజేయాలన్న తపనతో రూపొందించిన వ్యాససంపుటి- ‘సాహితీ కిరణాలు’

‘నిరంతర అధ్యయనం, నిర్విరామ సాహిత్య సృజన - ఈ రెండే ఉత్తమ సాహితీవేత్తగా రాణించడానికి మెట్లు’ అని త్రికరణశుద్ధిగా విశ్వసి స్తున్న ఈ తరం విదుషీమణి ఆచార్య కరిమిండ్ల లావణ్య. విమర్శకురాలిగా, వక్తగా, నిజాయితీ గల పరిశోధకు రాలిగా, ఉత్తమ అధ్యాపకులుగా, సమర్థవంతమైన పరిపాలనాదక్షులుగా, ప్రతిభావంతమైన విశ్లేషకులుగా బహుముఖీనమైన కృషిని కొనసాగిస్తున్న నిత్య సచేతన సాహితీ దీప్తి డా॥ లావణ్య.

ఒకవైపు అధ్యయనం, అధ్యాపనం అవిరామంగా సాగిస్తూనే, మరోవైపు తాను పనిచేస్తున్న తెలంగాణ విశ్వవిద్యాలయంలోని తెలుగు అధ్యయన శాఖలో పాఠ్యప్రణాళికా మండలి అధ్య క్షురాలిగా, తెలుగు శాఖాధ్యక్షురాలిగా, డీన్‌గా, ప్రధానాచార్యు లుగా, బాలికల వసతిగృహం వార్డెన్‌గా, పరీక్షల విభాగంలో అదనపు కంట్రోలర్‌గా, అనేక ఆంతరంగిక విభాగాలకు డైరెక్ట ర్‌గా బాధ్యతలు నిర్వహించి, నిర్వ హిస్తూ తనని తాను నిరూపించుకుం టున్న పరిపాలనా సవ్యసాచి ఆచార్య లావణ్య.

సాహిత్యం ఆమెకు హాబీ కాదు, అభిరుచి. వ్యవహారం కాదు, వ్యసనం. వెనుకతరముల వారి దేశభక్తిని, సామా జిక నిబద్ధతను, సాహితీపిపాసను తెలుసుకుంటూ ఉత్తేజం పొందడంతో సంతృప్తి చెందకుండా; నేటి తరానికి తెలియజేయాలన్న తపనతో రూపొందించిన వ్యాససంపుటి- ‘సాహితీ కిర ణాలు’. ఇందులో 22 మంది ప్రతిభా సంపన్నుల సాహితీ కృషిని డా॥ లావణ్య సముచితంగా విశ్లేషించారు. ఆయా సృజనకారుల విశేషాలను వివేచించారు. సాహితీ విమర్శ, కవి త్వం, పాట/ గీతం, నవలా ప్రక్రియ లను సంపద్వంతం చేసిన రచయిత లను; సామాజిక సేవాతత్పరులను మనకు పరిచయం చేస్తున్నారు.

‘సాహిత్యం కళ కోసమే, విమర్శ నమూ ఒక కళే’ అని విశ్వసించిన విమర్శకులు కాశీభట్ట సుబ్బయ్యశాస్త్రి.

‘కావ్యం మానవ జీవిత ప్రతిపా దనమైతే, కావ్య విమర్శ మానవ జీవిత తత్వాన్ని తెలిపేది’ అనడంతో పాటు నన్నెచోడుని కవితా శిల్పరహస్యాన్ని విడమర్చి చూపిన దార్శనికుడు శిష్టారామకృష్ణశాస్త్రి. హైదరాబాద్ స్వాతం త్ర్యోద్యమ చరిత్రను నేటి తరానికీ, రానున్న తరాలకూ కరదీపి కగా అందించిన స్వాతంత్ర్య సమరయోధులు వెల్దుర్తి మాణిక్యరావు. తెలుగు నాట సాంస్కృతిక పునరుజ్జీవన నేపథ్యాన్నీ, తెలంగాణలో సాంఘిక, సాంస్కృతిక పరిణామా లనూ వివేచించడంతో పాటు ఆంధ్రసారస్వత పరిషత్తుకు పర్యా యపదంగా నివసించిన వైతాళి కుడు దేవులపల్లి రామాను జరావు.

‘అధ్యాపన లేకుంటే మానసికాభివృద్ధి జరగదు, చింతన లేకుంటే ఆధ్యాత్మిక దృష్టి కలుగదు. ఈ రెండూ లేకుంటే సంస్కృతి ఉండదు. సారస్వ తం లోక కళ్యాణా నికి తోడ్పడాలి’ అని భూపతి లక్ష్మీనారాయణరావు సూచిం చారు. పద్యకవిత్వంలో వెల్లివిరిసిన సామాజిక స్పృహను విశదపరిచిన ప్రముఖ పండితులు, పరిశోధకులు నండూరి రామకృష్ణమాచార్యులు.

‘ఎలిజీ (స్మృతి కవిత) కేవలం ఆధునిక కవిత్వానికి సంబంధించినది మాత్రమే కాదు. ప్రాచీన కవిత్వం లోనూ దీనికి మూలాలున్నాయి. ఎలిజీ వంటి వేదనామయ కావ్యఖం డాన్ని తెలుగులో మొదట రచించి నవాడు వేముల వాడ భీమకవి. ఇతని ప్రభావం తోనే తిక్కన, పోతన, పెద్దన లు ఎలిజీలు రాశారు’ అన్న వినూత్న ప్రతిపాదన చేసిన కవి, విమర్శకులు, పరిశోధకులు ముకురాల రామారెడ్డి. ‘కవి సమయం రస పోషకంగా ప్రయుక్త మౌతుందనీ, ఔచిత్యం దీనికి జీవితమని, జాతి సంస్కృతినీ, ఆలోచనా ధోరణినీ, సౌందర్యతత్వ సమాలో చననూ వ్యక్తం చేస్తుందనీ’ డా॥ ఇరివెంటి కృష్ణమూర్తి నిరూపిం చారు. ఆయన ఒక ఉత్తమ అధ్యాపకుడు, ఉన్నత విలువలు పాటించిన పరిశోధ కుడు, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ పూర్వకార్యదర్శి. ప్రాచీన, ఆధునిక సాహిత్యాలపై సాధికారతను సాధిం చిన సంప్రదాయ విమర్శకుడు డా॥ ఇరివెంటి.

సుప్రసిద్ధ భాషా శాస్త్రవేత్తగా, అభ్యు దయ విమర్శకుడిగా, జర్నలిజం పాఠా లు చెప్పి, అనేక మంది జర్నలిస్టులను తీర్చిదిద్దిన ఉపాధ్యాయుడు, ప్రభావశీ లుడైన వక్త, నిబద్ధతకూ, నిర్భీతికీ నిలువెత్తు సంతకం డా॥ బూదరాజు రాధాకృష్ణ. వృత్తిరీత్యా తెలుగు అకాడమీ ఉన్నతాధికారి, ప్రవృత్తిరీత్యా నిర్మొహమాట విమర్శకుడు. ఒక సంచార విజ్ఞాన సర్వస్వం.

కవి, భాషాశాస్త్రవేత్త, ఒక ప్రముఖ దినపత్రిక కాలమిస్టు ఆచార్య చేకూరి రామారావు. ‘చేరాతలు’ కాలమ్ ద్వారా ఎందరో కవు లను, రచయి తలను వెలుగులోకి తెచ్చిన సహృదయ విమర్శకుడు. 1980 దశకంలో స్త్రీవా ద కవిత్వాన్ని నిండు మనసుతో బలపరిచిన సాహితీవేత్త. అనునిత్యం సాహిత్యవాద వివాదా ల్లో కేంద్ర బిందువుగా ఉంటూ తనను తాను ఉన్నతీకరించుకున్న ఉత్తమ మానవుడు చే.రా.

కవిత్వం అతని అభిరుచి. చారిత్రక నవలా రచన అతని ఊపిరి. భారతీ యత అతని ఆత్మ. సంప్రదాయ పరిర క్షణ అతని ధ్యేయం. చారిత్రక నవలా చక్రవ ర్తిగా గుర్తింపు పొందిన సాహితీవేత్త ఆచార్య ముదిగొండ శివప్రసాద్. ‘చారిత్రక నవలా రచన ఒక యోగం, ఒక యా గం. స్వరాజ్యాన్ని సురాజ్యంగా మార్చాలంటే మన దేశప్రజలు చరిత్రను తెలుసుకుని గౌరవించాలి. ప్రేమించాలి. చరిత్ర తెలియని వారు చరిత్ర హీనులవుతారని’ విశ్వసించే చరిత్ర ప్రేమికులు, పరిశోధకులు ఆచార్య ముది గొండ శివప్రసాద్.

ప్రాచీన, ఆధునిక, జానపద సాహిత్యాలపై సమగ్రమైన అధ్య యనం చేస్తు న్న నిత్యకృషీవలుడు, కవి, విమర్శకుడు, బహుగ్రంథకర్త, ప్రభావవంతమైన అధ్యాపకుడు, ఉత్తమ వక్త ఆచార్య కసిరెడ్డి వెంకట రెడ్డి. నిష్కళంక దేశభక్తి, నిబద్ధ జాతీయతా అనురక్తి, సంప్రదాయ రీతి అతని వ్యక్తిత్వం.

ఆట - పాట - మాటల మేలు కలయిక, జననాట్య మండలికి పర్యా యపదం, ప్రజాయుద్ధనౌక గద్దర్ (గుమ్మడి విఠల్). పాటను ఒక ప్రదర్శన కళగా, ప్రజా కళారూపంగా మలచిన ప్రతిభావంతుడైన కవి, ప్రజా వాగ్గేయ కారుడు గద్దర్. తన కలం ద్వారా, గళ గర్జనల ద్వారా లక్షలాది ప్రజలను ఉర్రూతలూపి, చైతన్యపరిచిన స్ఫూర్తిప్రదాత, ప్రజాసాంస్కృతి కోద్యమ రథసారధి గద్దర్. మనిషినీ, మనిషితనాన్నీ ప్రేమిం చిన అత్యుత్తమ మానవుడు గద్దర్.

తెలుగునాట హేతువాద భావ ప్రచారానికీ, భౌతికవాద ఆలోచనా ధారకూ అంకితమై పనిచేస్తున్న నిబద్ధ కార్యకర్త, కవి వల్లంపట్ల నాగేశ్వర రావు. అతడొక సామాజిక చైతన్య దీప్తి. సాంస్కృతిక వికాస స్ఫూర్తి. పాట అతని ఆయు ధం. దేశభక్తి అతని లక్ష్యం. సమ సమాజ నిర్మాణం అతని గమ్యం. ఉత్తమ మానవ నిర్మా ణం అతని అంతిమ లక్ష్యం.

జన్మరహస్యాన్నీ, ప్రేమగుభాళిం పునూ, కరుణ వల్ల కలిగే ఔన్నత్యాన్నీ మనిషి ఆస్వాదించినప్పుడే మానవుడవుతాడని బలంగా నమ్మిన కవి, నటుడు, చిత్రలేఖకుడు, గాయకుడు, కథకుడు, ప్రయోగకర్త, పరిశోధకుడు, విమర్శకుడు, అధ్యాపకుడు డా॥ చాట్ల నర్సయ్య. స్వాతం త్ర్య పరిరక్షణ, జాతీ య సమైక్యత, కులరహిత సమాజ నిర్మాణం, స్వార్థ త్యాగం అతని ఆదర్శాలు.

నిరంతర అధ్యయనం, బహుముఖ గ్రంథ పఠనం, సూక్ష్మపరిశీలనం, సమ్యక్ దృష్టి, సహృదయతల మేలు కలయిక కె.వి.అశోక్‌కుమార్. వృత్తి గ్రంథపాలకుడు, ప్రవృత్తి సాహిత్య అధ్యయనం. ఈ రెండింటికీ సమన్వ యం కుదిరింది. ఒక వ్యాసం రాయాలన్నా, ఏదైనా సదస్సులో ప్రసంగిం చాలన్నా, గ్రంథావిష్కరణ సభలో పుస్తక విశ్లేషణ చేయాలన్నా అశోక్‌కుమార్ ఎంతో సీరియస్‌గా, ఒక తపస్సులాగా సిద్ధమై వస్తాడు. అలవోకగా మాట్లాడ టం, కాలక్షేప సంభాషణం అతనికి చేతకాదు. ప్రపంచీకరణ, పర్యావర ణం, సమకాలీన సామాజిక వాతావరణం తెలుగు సాహిత్యంపై వస్తున్న ప్రభావాలను సాధికారికంగా విశ్లేషిస్తున్న నిశిత పరిశోధ కుడు, నిబద్ధ విమర్శకుడు అశోక్‌కుమార్.

అతడొక నిర్విరామ సాహి తీ శ్రామి కుడు. నిరంతర అధ్యయన సంప న్నుడు. నిజాయితి ఆయన వ్యక్తిత్వం. నిబద్ధత ఆయన స్వభావం. మార్క్స్ అంటే అతనికి అభిమానం. అంబేద్కర్ అంటే అతనికి ఆరాధన.

అభ్యుదయ, విప్లవ సాహిత్యాల సైనికుడు. దళిత సాహితీ క్షేత్రంలో నిత్యకృషీ వలుడు. బోధన, పరిశోధనల ఘనాపాటి. బహు ముఖీనమైన ప్రతిభను ప్రదర్శిస్తున్న పరిపా లనాదక్షుడు ఆచార్య బన్న అయిలయ్య రాసిన ‘ధార’ సాహిత్య వ్యాసాలు కవిత, కథ, నవలా సాహిత్య ప్రవంతులు.

సామల సదాశివ బహు భాషాకోవిదులు. తెలుగు, హిందీ, ఇంగ్లీష్, మరాఠీ, ఉర్దూ, ఫారసీ భాషలను ఔపోసన పట్టిన సం చార జ్ఞాన సంచయం. హైదరా బాద్ సంస్థాన చారిత్రక పరిణా మాలకు సజీవసాక్షి. గాలిబ్ కవిత్వ అంతరంగాన్ని అభిని వేశంతో ఆవిష్కరించారు.

రచయిత్రిగా, సంఘసే వికగా ద్విముఖ కృషిని సమర్థ వంతంగా నిర్వహించిన విదుషీమణి ఇల్లిందల సరస్వతీదేవి. స్త్రీలు తమ కాళ్ళమీద తాము ధైర్యంగా నిలబడడం నేర్చుకో వాలని ప్రబో ధిస్తూ అనేక నవలలు, కథానికలు, వ్యాసాలు రాసి సమాజాన్ని జాగృతం చేసిన చైతన్యశీలి. స్త్రీల హక్కుల పరిరక్షణ; స్త్రీ, పురుష సమాన త్వం, భావ సమైక్యత, జాతీయ సమైక్యత, ఉన్నతమైన మానవ విలు వలు, ఉత్తమ మానవ సంబంధాలను త్రికరణశుద్ధిగా ఆకాంక్షిస్తూ; వీటికోసం జీవితాన్ని, వ్యక్తి త్వాన్ని, సాహిత్యాన్ని అంకితం చేసిన ధన్యజీవి సరస్వతీదేవి సార్థక నామధేయురాలు.

వేదాలు, ఉపనిషత్తులు అతనికి కంఠోపాఠం. ప్రాచీన, ఆధునిక సాహిత్య గ్రంథాలు అతనికి నిత్య పఠనీయాలు. కవిత్వం అతని అభినివేశం. ఆర్ష ధర్మప్రచారం అతని ఆరవ ప్రాణం. అతడు ఆర్య సామాజికుడు. ఉత్తమ సమాజ స్వాప్నికుడు.

స్నాతకోత్తర విద్యలో బంగారు పతకం అతని ఆభరణమైతే, రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ అధ్యాపక పురస్కారం అతను సాధించిన సముచిత గౌరవం. ఆచార్య మసన చెన్నప్ప బహుగ్రం థకర్త. అనేక సన్మాన సత్కారాలను పొందిన ఉత్తమ వక్త.

దేశ, విదేశా లలో తన ప్రసంగాలతో వేలాది మందిని ఉర్రూతలూగించిన ప్రతిభావంతుడు, కవి, విమర్శకుడు, పరిశో ధకుడు, పరి శోధనల పర్యవేక్షకుడు, చిరునవ్వుతో మిత్రులను ఆప్యాయంగా పలకరించే సహృదయుడు. అపారమైన శిష్య సంపదను, మిత్ర సంపదను కలిగి ఉన్న సంపద్వంతుడు ఆచార్య మసన చెన్నప్ప.

> ‘అధ్యాపన లేకుంటే మానసికాభివృద్ధి జరగదు, చింతన లేకుంటే ఆధ్యాత్మిక దృష్టి కలుగదు. ఈ రెండూ లేకుంటే సంస్కృతి ఉండదు. సారస్వతం లోక కళ్యాణానికి తోడ్పడాలి’

తెలుగు, కన్నడ, ఆంగ్ల భాషలపై పట్టు సాధించిన ప్రజ్ఞావంతురాలు ఆచార్య కొలకలూరి ఆశాజ్యోతి. కవ యిత్రిగా, పరిశోధకురాలిగా, విమ ర్శకురాలిగా, అనువాదకులుగా, కథకులుగా, నవలా రచయితగా బహుముఖీనమైన కృషిని కొనసాగిస్తున్న నిత్య చైతన్యశీలి, నిర్విరామ సాహిత్య తపస్వి ఆశాజ్యోతి రచించిన ‘బతుకు’ నవలలోని పదప్ర యోగ వైవిధ్యాన్ని ఆచార్య కరిమిండ్ల లావణ్య సముచితంగా విశ్లేషించారు.

విభిన్న భావధారలకు, దృక్పథాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న సాహిత్య తేజోమూర్తుల కృషిని నేటి తరానికి పరి చయం చేస్తున్న ‘సాహితీ కిరణాల’కు స్వాగతం. మా పుత్రికా సమానురాలు లావణ్యకూ, ఆమెకు ఎల్లవేళలా చేదోడువాదోడుగా ఉంటు న్న ఆమె భర్త రాజేశ్ కూ, సంస్కారవంతులైన ఆమె పిల్లలకూ అభినందనలు, ఆశీస్సులు.

(ఆచార్య కరిమిండ్ల లావణ్య వ్యాస సంపుటి “సాహితీ కిరణాలు”కు ప్రొ॥ ఎస్వీ సత్యనారాయణ రాసిన ముందు మాట...)

---



-డా॥రావి రంగారావు
9247581825

ఈ వారం అంశం: అవకాశ వాదులు

పేస్ బుక్ “అ మరావతి సాహితీ మిత్రులు” గ్రూపు లో డా॥ రావి రంగా రావు 20 24 నుండి నిరంతరాయంగా నిర్వహి స్తున్న వారం వారం కవితల వర్క్ షాపులు.

వారం వారం కవితల వర్క్ షాప్ 44 అంశం “గ్రంథాలయాలు”. మొత్తం 20 మంది కవితలు పంపగా 7 కవితలు ఉత్తమ స్థానంలో నిలిచాయి.

## ఆధునిక దేవాలయాలు

సరస్వతీ పుత్రుల ఆత్మలను
వెలిగించే దివ్యమందిరాలు,
గురువు లసలు కనిపించని
నిశ్శబ్ద విద్యాలయాలు,
అన్వేషకుల కోసం
భావాల దొంతరలు వేచి చూచే
నిరీక్షణాలయాలు...
అన్ని ఋతువులందు
జ్ఞాన దాహార్తి తీర్చే పుణ్య తీర్థాలు
సంస్కారాలకు జీవం పోసి
జాతికి నవ చైతన్యమిచ్చు
కల్ప వృక్ష వనాలు...
విజ్ఞాన తపస్సు ఫలింపజేసే
ఉన్నత హిమాలయాలు,
మట్టిని మణిగా తీర్చే
మహిమాలయాలు...
అక్షర విత్తులు
ఇక్కడ మళ్ళీ మళ్ళీ మొలకెత్తుతూ
జిజ్ఞాసువులకు వెలుగు నిస్తాయి,
ఆధునిక దేవాలయాలు
ఈ గ్రంథాలయాలు...

-అనుముల బదరీనారాయణ,
బెంగుళూరు

## విజ్ఞాన గవాక్షాలు

అక్కడ...
అక్షర సుగంధాలను
పులుముకున్న పుస్తకాలు ఎన్నో,
మస్తకాలను హత్తుకోవడానికి
ఆత్రంగా ఎదురుచూస్తుంటాయి...
ఎవరైనా వచ్చి
ఆప్యాయంగా తల నిమిరితే చాలు,
రెక్కల విచ్చుకొని అరచేతిలోకి వాలిపోతాయి...
దిగులు చెందిన కళ్ళకు
రేపటిపై ఆశల శ్వాసలు నింపుతాయి,
చిన్నారి చేతుల్లోకి చేరి
ఎదనిండా ఆనందాన్ని ఒంపుతాయి..
ఎందరో నిరుద్యోగులు
ఆ పుస్తకాలు వెలుగులోనే
గొంగళి పురుగు నుంచి
రంగురంగుల సీతాకోకచిలుక లయ్యారు...
గ్రంథాలయాలు కావవి,
విజ్ఞాన కాంతులు వెదజల్లే గవాక్షాలు,
దేశ భవిష్యత్తును
మానవత దారులలో నడిపే రథ చక్రాలు...
ఉద్యమాల ఊపిరితో
పురుడు పోసుకున్న
విజ్ఞాన భాండాగారాలు అవి,
వసతుల కొరత నిధుల లేమితో
జీవ కళను కోల్పోతున్నాయి నేడు...

-జాగరాపు శంకరరావు
విజయనగరం

## అమృత భాండాగారాలు

లిపి పుట్టని అనాది కాలంలో
మానవముఖతః పుట్టింది సాహిత్యం,
గురు బోధనలకు మేదళ్ళే పుస్తకా లయ్యాయి,
జిహ్వాలు లేఖినీ రూపం ధరించగా
అధరాలు పదాలను పేర్చాయి,
యుగాలు కాలాలు తరలి వెళ్ళాయి,
అక్షరాలన్నీ కావ్య రూపాన్ని పొంది
పుస్తకం మానవ హస్తగతమైంది,
నవీనశోభతో జ్ఞాన నిధు లయ్యాయి,
నిస్తేజంలో చైతన్యాన్నందించే
కాంతి రేఖలు,
మనశ్శాంతికూర్చే శాంతి కపోతాలు,
వ్యక్తిత్వానికి వెలుగు నింపే దివ్వెలు,
విజయానికి దిశానిర్దేశం చేసే ద్రష్టలు,
జ్ఞానాన్ని ప్రసాదించే మహర్షులు,
కనులకు కనిపించే ప్రత్యక్ష దైవాలు,
అంతర్జాల దూరదర్శన్ జిమ్మిక్కులతో
నిశ్శబ్దంలో రాజ్యమేలుతూ
వల్మీకంలోనుంచి ఉద్భవించిన వాల్మీకివలే
తరతరాలకు మానవతా విలువల నందించే
మన గ్రంథాలయాలు
అక్షరాలఅమృత భాండాగారాలు.

-డా.మైలవరపులలితకుమారి
గుంటూరు

## గ్రంథాలయం

నిశ్శబ్దం మధ్యలో
జ్ఞానం మ్రోగే ఆలయం ఇది,
పుటల వెనుక మార్మోగే
మనసుల కలయికల దీపం...
ఇక్కడ మాటలు చెట్లుగా పెరుగుతాయి,
వాటిఛాయలో
తలదాచుకుంటుంది సమయం...
ఒక పుట తెరిచినదే కాదు,
అది ఒక ఒక లోకము ,
సిరి గీతలలో కదిలిన
ప్రతి అక్షరం ప్రాణమైపోయింది...
పాత పుస్తక సువాసన ?
కాల గమనమనే గంధం,
కొత్త జ్ఞానం
వెలుగు చిందించే దీపధార గ్రంథాలయం.
వెళ్ళినవాడు వెలుతురుగా వస్తాడు,
తెలిచిన లోకమంతా
మేధస్సు తీరం చేరుతుంది...
నిశ్శబ్ద పుస్తకాలు గళమెత్తే చోటు ఇది,
భవిష్యత్తును చరిత్రతో కలిపే వంతెన ఇది.

-రహంతుల్లా (కర్నూల్)

## వరాలిచ్చే ఆలయాలు

మనకు జ్ఞాన వరాలిచ్చే
దేవాలయాలు -
గ్రంథాలయాలు.
నువ్వు గదినే వెలిగిస్తావు
నిన్ను వెలిగించే గది మాత్రం
గ్రంథాలయం.
ఏ ఆలయంలో
ఏ దేవుడు కొలువున్నాడో
తెలియదుగానీ
ఈ గ్రంథాలయంలో
కొలువున్నదేవుడు మాత్రం
”పుస్తకం”
నిశ్శబ్దంగా నిన్ను
శిల్పంగా మలిచే చోటు -
గ్రంథాలయం.

-చిత్తలూరి, హైదరాబాద్

## గ్రంథాలయం

గోడల మధ్య నిశ్శబ్దం కాదు,
కాలం ఊపిరి తీసుకుంటున్న శబ్ద మది
పాత పుటలు నిశ్శబ్దంగా తిప్పినపుడు
ఓ యుగం పాదరసంలా జారిపోతుంది.
పెదవి తగలని పదాలు
ఇక్కడ నివసిస్తాయి,
గీతలు మసకబారినా, భావాలు మసకబారవు.
తలుపు తీయగానే పుస్తకాల వాసన,
ఎంతగానో తడిమిన జ్ఞాపకంలా తగులుతుంది.
ఆ సువాసనలోనే
ఓ మృదుత్వం మిగిలుంది.
కుర్చీలు ఇక్కడ సాక్షులు,
ఎన్ని గుండెలు తేలినాయో, ఎన్ని తడిమాయో
తెలిసినవే అవి....
గడియారాలు కదులుతూనే ఉన్నా
సమయ మిక్కడ ఆగిపోతుంది.ఔ
ఓ పేజీ తెరచిన వెంటనే
అనంత మవుతుంది.
గ్రంథాలయం
పేపరు శబ్దం కాదు
మనిషి లోపలి నిశ్శబ్దం యొక్క ప్రతిధ్వని.

-నవీన్ హోతా
రాజమహేంద్రవరం

## గ్రంథాలయాలు

గ్రంథాలయాలు వాగ్దేవి నిలయాలు,
కవులు, మేధావులు, శాస్త్రవావేత్తల
అనుభవ సారాలు,
ముత్యాల సరాలై వొదిగి
సుమ సౌరభాలు వెదజల్లు
పుస్తక భాండాగారము...
పేదల పాలిట జ్ఞాన కాంతులు
వర్షించు కల్పతరువై
విద్యార్థుల పాలిట విజ్ఞాన వీచికలై
గురువు వలె బోధిస్తూ
స్నేహితునిలా ఆదరిస్తూ
విజ్ఞానవంతులుగా తీర్చిదిద్ది
విజ్ఞాన భాండాగారము...
నిశ్శబ్దమే పెట్టుబడిగా
జ్ఞానం, ఏకాగ్రతలనే
పున్నమి వెలుగుల్లో సేదతీరుస్తూ
అక్షర తూణీరాలను
మదినిండా చొప్పిస్తూ
మనోల్లాసం కలిగిస్తూ
ప్రశాంతతకు చిరునామాయై...
వయో బేధం, వర్గ బేధాలకు తావీక
తల్లివలె అక్కున జేర్చుకుంటూ
లాలిస్తూ పాలిస్తూ
విజ్ఞాన తృష్ణ తీరుస్తూ
సమాజ వికాసానికి, దేశాభ్యున్నతికి
మూల స్తంభాల్లా గ్రంథాలయాలు.

-సంబరాజు రమణి (గుంటూరు)

---



కవితార్చన

అడ్మిన్: డా॥రాధాకుసుమ
సెల్:99892 41319

“కుసుమ ధర్మన్న కళా పీఠం” సంస్థ ప్రతిరోజు కవిత్వ రచన చేయిస్తుంది. అందులో ముఖ్యమైన కొన్ని కవితలను నేటినిజం పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం..

మా తరాల తలరాత మారుస్తా
మమ్మల్ని పగబట్టిన
శని దరిద్ర పిశాచాన్ని ఓడిస్తా
నా తండ్రి ఆకలి కన్నీటిని తుడుస్తా
నా జన్మకు అర్థం చూపిస్తా
నా తల్లి రుణం తీరుస్తా
సునామీ నై ప్రళయం సృష్టిస్తా
బ్రహ్మ రాసిన రాతను
నా చెమట కష్టం తో మారుస్తా
నా జీవితమే ఆదర్శంగా జీవిస్తా
జీవిత చరిత్ర సృష్టిస్తా
నన్ను ఓడించడం దరిద్ర పిశాచానికి
కష్టమని నిరూపిస్తా
నా కలల విజయాన్ని సాదిస్తా
ఎత్తైన శిఖరం లా నిలుస్తా
తుఫాను నై మమ్మల్ని పట్టిన దరిద్రాన్ని తరుముతా
పేదరికాన్ని రాకెట్ లా చీల్చుకొని దూసుకుపోతా
సువర్ణ అక్షరాలా చరిత్ర లిఖిస్తా
జీవిత విజయజెండా ఎగరేస్తా..

-యాకల విద్యా సాగర్
+91 79819 24253

## మసక బారిన కనులు

ప్రతిచూపులో కన్నీరుప్రతి అడుగు గమ్యం వైపు
సొంత మట్టి స్పర్శని విడవాల్సిన పాదము అది దౌర్భాగ్యము
అంతులేని ఆవేదనాగ్నితో నిండిన హృదయము
వలస కాదు కాదు ప్రయాణం అది ఒక బలవంతపు త్యాగము
వ్యక్తిగత నిరాసే కాదు వ్యవస్థల ఘోర వైఫల్యము.
త్వచమై చుట్టిన పేదరికము మొదటి కారణం
నిరుద్యోగము నిస్సహాయత ప్రకృతి ఇచ్చిన కరువు
కాటకముఅంధకారము.
జీవనం పై వేటు ఆర్థిక వ్యత్యాసాల పోట్లు
ఆకలికేకల మధ్య ఊరు మీ విడవక తప్పని శాపము.
మదిలో మౌనరోధనల నడుమ ఊరునుదిలి నగర ఆకర్షణ
ద్వితీయ కారణమవుగా.
తళుకు బెలుకులు కనులకు వేసే మాయా తెరలు స్వప్నాల
వెంట పరుగులు.
అయిన వారిని వదిలి భావోద్వేగాన్ని బలవంతంగా అనుచుకొని
కడుపులో దాచుకున్న నిశ్శబ్ద రోదనలు.
ఊరు కానీ ఊరిలో ప్రతిక్షణం బాధ్యతా స్మరణం శ్రమే శరణం.
భ్రమగా విశ్రాంతి.
కనుల వెనక ఆవేదన అంతరంగ ఘోష
ఏ మానవ కొలమానం ఆ దుఃఖపు లోతులను కొలవగలదు.
ఆవేదన అనంతరం బాధ అపారం
ఆ బాధ హృదయ విదారకం

-పారేపల్లి నాగేశ్వరమ్మ
+91 73869 99490

## అమ్మ

కష్టాల కొలిమిలో కాలుతున్నా
వెన్నెల చల్లదనాన్ని అందిస్తూ
కరుణ కురిపిస్తూ
సంతోష గీతాలు వినిపించేదే కదా అమ్మ అంటె.......
”పూరింపో, కొనసాగింపో,
ఏమైనా నా దృష్టి / సృష్టి ( కవితా)లో అమ్మ
అమ్మకు జేజేలు
అమ్మ ఒక అద్భుతం
నిర్వచనానికి అతీతం
అమ్మతనం అద్వితీయం
ఆమె
ప్రేమ అమృత తుల్యం
అమ్మ ఆత్రం అనంతం, ఆద్రత భరితం
ఆమె ఆర్తి స్వార్థ రహితం
అమ్మ శ్రమ శిఖరాగ్రం ఆమె కదే సాఫల్యం
అమ్మ కష్టం కడ గళ్ళ మయం ఆమె కదే ఇష్టం
అమ్మ త్యాగం ఆమూలాగ్రం, ఆమె కదే ఆహ్లాదం
అమ్మ మాట వేదోక్తం, అది ఆమె అనుభవైక వైద్యం
అమ్మ పాట సరస్వతీ నాదం
అమ్మ కథలు జీవన సూక్తులు,
పావన ప్రయోక్తులు
అమ్మ దయ సాగర సమం
అమ్మ కరుణ, కారుణ్య కలశం
అమ్మ అనురాగాల రాగం
అమ్మ ఆలంబనల ఆలయం
అమ్మ ఓర్పు, ఓదార్పుల కూర్పు
అమ్మ లాలన అనురాగ పాలన
అమ్మ పాలన ఆరోగ్య పోషణ
అమ్మ స్ఫురణ స్ఫూర్తి కారణం
అమ్మ స్మరణ శక్తి పూరణం
అమ్మ అనుభూతుల అభ్యంగనం
అమ్మ దైవానికి మారు రూపం
అమ్మ దివ్యం, అమ్మ సాక్షాత్ దైవం
అమ్మ సృష్టి విచిత్రం, విధాత ఉదాత్త విరచితం
అమ్మ జన్మ కారణం, కారకం
అమ్మ పున సృష్టి ప్రాకారం
అమ్మకు సాటి పోటీ అసాధ్యం
అమ్మ రుణం తీర్చడం అసంభవం
అమ్మ సత్యం, అమ్మ నిత్యం
కావాలి ఆ త్యాగ నిరత సాధ్వి తలంపు
అనుక్షణం ప్రతి నిత్యం
అప్పుడే ఆమెకు సంతోషం, మనకు సాఫల్యం
అందుకే అమ్మా నీకు నిత్య నీరాజన జేజేలు
అందుకో అమ్మా నా అనుక్షణ జోహార్లు
అమ్మా! అమ్మా! అమ్మా!
అమ్మా నీకు జేజేలు,
మాయమ్మా నీకు జోహార్లు......

-ఎరబాటి
+91 97050 846

## వలసలు సుదూర తీరాలు

నివాస ప్రాంతంలో లేదు తెరువు
పనివున్నచోటకి తప్పదు పరుగు.
భార్యాబిడ్డలను వదిలి
సుధూర తీరాలు చేరుతారు ..
బ్రతుకుతెరువుకు తప్పదు
పరుగుల పయనం. పోరాటం.
బంధాల ఒకచోట భవిష్యత్తు ఒకచోట.
అందరి కలిసి ఉంటే చాలదు జీతం ఆ చోట
అందుకే విడిపోయి వేయాలి
అడుగులు జీవనానికై ..
కుటుంబం అంతా బ్రతకొచ్చనే ఆశ
కష్టమైనా అందరినీ వదిలి వెళ్ళక తప్పదు ఆ దిశ..
ఊరు కాని ఊరు.. దేశం గాని దేశం తెలియన
ప్రాంతం ..భాషా.. అయినా కష్టపడుతూ పైసలు
కూడా పెట్టేరు కుటుంబ పోషణకు ...
తన కుటుంబాన్ని ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేయాలని
ఒంటరి ప్రయత్నం చేస్తూ ఉంటారు వలసదారులు...
కొన్నిచోట్ల కుటుంబాలతో సహా వెళ్లి
డేరాలు వేసుకుని ఉంటారు ..
అనుకూలించని వాతావరణం..
ప్రాంతాలు మారేసరిక శరీర అనారోగ్యం . వారి
స్వస్థల గాలి లేక పడుతుంటారు పాట్లు.
వీరి పిల్లలకు ఎక్కడుంటే అక్కడ చదువుకునే
సదుపాయం ఉండాలి ..
ప్రభుత్వ ఆసుపత్రులలో సరియైన వైద్యం ఉండాలి.
అప్పుడే ఈ వలస కూలీలకు కాస్త మెసులుబాటు లుగు
బాట అవుతుంది వీరికి

-ఆలపాటి సత్యవతి, +91 8309924925

# జీవనోపాధుల నెలవులు హిమనీనద పర్వత ప్రాంతాలు

పర్యావరణ పరిరక్షణ, వాతావరణ సకారాత్మక మార్పులు, పేదరిక నిర్మూలన, జీవవైవిధ్య సంరక్షణ, జీవ వ్యవస్థల నియంత్రణ లాంటి పలు ప్రయోజనాలకు పర్వతాలు ఎంతగానో సహకరిస్తున్నాయి. ప్రకృతి ప్రసాదించిన శాశ్వత, సుందర పర్వతాల పరిరక్షణ ప్రాధాన్యాన్ని అవగాహన పర్చడం, పర్వతాల పరిరక్షణ కారణాలను వివరించడం, సుస్థిరాభివృద్ధికి తోడ్పడడం లాంటి అంశాలను విస్తృతంగా చర్చించడానికి ప్రతి ఏట 11 డిసెంబర్ రోజున ఐరాస నేతృత్వంలో ప్రపంచ దేశాలు "అంతర్జాతీయ పర్వతాల దినం (ఇంటర్నేషనల్ మౌంటెయిన్ డే)" పాటించుట జరుగుతున్నది. ఈ వేదికను పర్వత విజ్ఞానశాస్త్ర వినియమయం, ఉత్తమ నియంత్రణ మార్గాల చర్చ, సమైక్యంగా పర్వతాల పరిరక్షణ యజ్ఞాలను కొనసాగించడం లాంటి ప్రధాన అంశాలను తీసుకోవడం కొనసాగుతున్నది. ఐరాస నిర్ణయం ప్రకారం 2002 ఏడాదిని "అంతర్జాతీయ పర్వతాల సంవత్సరం"గా పాటించడం, 2003 నుంచి ప్రతి ఏట 11 డిసెంబర్ రోజును "అంతర్జాతీయ పర్వతాల దినం"గా వేడుకగా జరుపుకోవడం కొనసాగుతున్నది.

**అంతర్జాతీయ పర్వతాల దినం-2025 ఇతివృత్తం:**

ఐరాస నిర్ణయం ప్రకారం 2025 ఏడాదిని "హిమనీనదాల పరిరక్షణకు అంతర్జాతీయ సంవత్సరం" అని నిర్ణయించడం జరిగింది. అదే క్రమంలో అంతర్జాతీయ పర్వతాల దినం-2025 ఇతివృత్తంగా "జలం, ఆహారం, జీవనోపాధులకు పర్వత ప్రాంత హిమానీనదాలు" అనబడే అంశాన్ని తీసుకోవడం జరిగింది. ఇన్నొవేషన్‌ను జోడిస్తూ పర్వతాల సంక్లిష్ట సమస్యలకు సమాధానాలు వెదకడం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పర్వతాలను కాపాడు కోవటం, డిజిటల్ వేదికగా పర్వతాలను పర్యవేక్షణ చేయడం, సృజన శీల ఆలోచనలతో సమస్యలను పరిష్కరించడం, వాతావరణ మార్పు లకు అనుగుణంగా నూతన వ్యవసాయ పద్ధతులను పాటించడం, పర్వతాల పరిరక్షణ నిర్వహణతో పాటు నిధులు ఏర్పాటు చేయడం కొనసాగడం నేటి కనీస అవసరమని భావిస్తున్నాయి ఐరాస సభ్యదేశాలు.

**పర్వతాల ప్రధాన ప్రయోజనాలు:**

పర్వతాల పరిరక్షణతో సంబంధం ఉన్న వాతావరణ సానుకూల మార్పులు, లింగ సమానత్వ సాధన, సామాజిన న్యాయం, ఆవిష్కరణలు, సాంస్కృతిక వికాసం, ఔషధాల కొలువులు, శక్తి వనరుల కేంద్రాలు, సమ్మిళిత అభివృద్ధి, పని కల్పన, ఉద్యోగ ఉపాధుల కల్పన, జీవనోపాధికి మార్గాలు, సుజల నిధుల భండాగారాలు, వ్యవసాయ నెలవులు, గిరిజన జాతులకు అమ్మ ఒడి, నేల కోతను అరికట్ట డం, హరిత క్షేత్రాలుగా నిలవడం, ఆహార పదార్థాల కేంద్రాలు, ఔత్సాహికులను ప్రోత్సహించడం లాంటి లక్ష్యాలను తీసుకొని ప్రపంచవ్యాప్త యువత సుస్థిరాభివృద్ధికి బాటలు వేయాలని ప్రపంచ మానవాళి కోరుకుంటున్నది. పర్వత ప్రదేశాలు 15 శాతం ప్రపంచ జనాభాకు ఆవాసాలుగా నీడనిస్తూ, దాదాపు 50 శాతం జీవవైవిధ్య కేంద్రాలుగా మహోన్నత సేవలు చేస్తున్నాయి. మహోన్నత పర్వతాలు 311 మిలియన్ల ప్రపంచవ్యాప్త నిరు పేదల పుట్టినిళ్లు.

ప్రకృతి అంటేనే ఎత్తైన పర్వతాలు, జరజరా జారే జీవ నదులు, చల్లగా వచే శీతల పవనాలు, ధోరిణి మాత చుట్టిన అందమైన హరిత చీరలు అని మనకు తెలుసు. నేడు పర్యాటకం అనేక రెట్లు పెరగడంతో పర్వత ప్రాంతాలు తమ సహజత్వాన్ని కోల్పోతూ, కార్బన్ కాలుష్య కూపాలు, హరిత ప్రాంతాల క్షీణత, నేల నాణ్యత పడిపోవడం లాంటి అవాంఛనీయ మార్పులు చోటు చేసుకోవడం విచారకరం. పర్వతాలను కాపాడకపోవడం అంటే మన ఉజ్వల భవిష్యత్తుకు మనమే పునాదులు వేసుకోవడమని తెలుసుకొని సన్మార్గంగా నడుద్దాం, పర్వతాలను ప్రేమతో ఆలింగనం చేసుకుందాం.

(11 డిసెంబర్ "అంతర్జాతీయ పర్వతాల దినం" సందర్భంగా)



-ఆచార్య బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 1638వ రోజు 'టెలివిజన్' అనే అంశంపై పలువురు కవులు తమ కవితలను పంచుకున్నారు. కవితల సాధన చేస్తున్న కవులందరికీ అభినందనలు. 'టెలివిజన్' అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం. -సంపాదకులు



**మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం**
అడ్మిన్ & ఏకాంశ కవిత్వ నిర్వహణ:
-డా॥రాయారావు సూర్యప్రకాశ్‌రావు,9441046839

## తోడు

ఒంటరి ఏకాకికి కాలక్షేపం
ఇంట్లో అలా మోగుతూ వాగుతుంటే
పిల్లలు వృద్ధులకు సంతోషం
తెల్లవార్లూ ఊసుపోని కబుర్లు
చూడలేని ప్రాంతాలు, ఆలయాలు
ప్రపంచాన్ని చుట్టే వార్తలు
అందరిళ్లలో
కళ్లు చెవులకి దృశ్య శ్రవణానందం.
బోసినవ్వుల పాప అవ్వ తాతలకు
కాలు కదపకుండా పరమానందం
కాలం రోజు గిర్రున
బోర్ కొట్టకుండా బోలెడన్ని కబుర్లు.
తామరతంపర అల్లిబిల్లిగా
అల్లుకుపోయిన దర్శనం
దూరదర్శనం.
కురుక్షేత్ర యుద్ధాన్ని చూస్తూ
వర్ణించిన సంజయుడు
ధృతరాష్ట్రునికి తృప్తి కల్గించిన తీరు
నేటి క్రికెట్ మ్యాచ్ తో రోడ్లన్నీ ఖాళీ.
కలర్ టి.వి.లతో రిమోట్ తో ఛానల్స్
సంగీత సాహిత్య కళలకు కాణాచి.
అతితో పిల్లలు
రిమోట్ కై ఫైటింగులు
కోప్పడితే చస్తాం అని బెదిరింపులు
పూరిగుడిసె మొదలు
ఆస్పత్రులలో కాలక్షేపం
ఇడియెట్ బాక్స్ అని బిరుదు
ఉపాధిగా
వ్యక్తులలోని ప్రతిభను వెలికి తీసే టి.వి.
టైం మింగేసి పుస్తకాల్ని అటకెక్కిస్తుంది
అందుకే మితి పరిమితి శ్రేయోదాయకం.
-ఎ.రాజ్యశ్రీ

## దూరవాణి

అలరించే దూరదర్శన్ పెట్టె
పంచుతుంది
జ్ఞానం పది కాలాలు
అరవై నాలుగు కళలలో
ఒప్పించి
సంతోషమిస్తుంది
అందరికీ వినోదాత్మకంగా!.
దూరవాణి
సినిమాలకి అంకితం
కథలు సీరియల్స్ ముమ్మరం
సినిమా పంథాలో నడక
నిజానికి దూరం అంతా.
స్వంత కొంత కొరవడి
అసలు మరిచి
అబద్ధపు చేష్టలు
అశ్లీల కబుర్లు
తప్పని తలకాయ నొప్పులు
ఆనాడు ఆకాశవాణి మాదిరి
జ్ఞాన భాండాగారం
చదువు, సంగీతం, నాట్యం
సర్వ కళల్లో మంచి రీతి.
ఉన్నతమైన స్థానం
అందాలు సంతరించుకొని
అవలీలగా కలలను
పెంపొందిస్తుంది
ఆనందాల విందుకి!!!.
-కె.కె.తాయారు

## దుర్మార్గ దర్శనం

ఇదిలేని రోజుల్లో
మది స్థిమితం
దీనితో వచ్చింది
అస్థిమితం.
సీ-రియలు అంటూ
కూర్చున్న చోట నుంచి
కదలని కథలు
పదుల, వందల
వత్సరాలు గడిచినా
జనగణమన పాడని వ్యథలు.
నేటి ఇళ్లల్లో
ఒకరో ఇద్దరో
బిక్కు బిక్కు మంటూ
సీరియళ్ళలో మాత్రం
ఉమ్మడి కుటుంబంలో
గుమ్మడి పండ్లలా
దజనుకుపై మాటే.
సీరియల్ బోరు పుట్టి
స్టేషన్ మార్చితే మరో తలనొప్పి
ఆరాచకీయనాయకులు
అర్థం కాని గాయకులు
హాస్యం శూన్యమై
అసహ్యం అందలమెక్కిన
కార్యక్రమాలు
ఆర్భాటాల
సభలు సమావేశాలు
ఇవే దగ్గరగా దర్శించి
తరించే
దూరదర్శన్ కార్యక్రమాలు.
ఏవి సంగీత కచేరీలు
సాహిత్య చర్చలు
పద్య పఠనాలు
ఎక్కడ విద్యకు విలువలు?
మహామహుల పరిచయాలు
ఏవి? ఎక్కడ?
గుడ్డిలో మెల్ల
పిల్లల పాటల పోటీలు.
టీవీ పార్వతీదేవికి
ముఖాన బొట్టు ఉండదు.
సీతమ్మకు
చీర సరిగా ఉండదు.
ఆడపిల్లల డ్యాన్సులు
చూడలేని
చూడరాని తల వంపులు.
మార్పులు కావాల్సిందే
అది మితిమీరి
మతి పోతున్నది
ఇంట్లో నుంచి కదలనంటున్న
దూరదర్శన్ తో వచ్చిన బాధ.
ఆలోచించాలి పెద్దలు
దూరదర్శన్ కు చేయాల్సిన
మరమ్మత్తులను గురించి.
-డా.సి.వసుంధర

## రంగులతెర

ఆకాశవాణిని పక్కకునెట్టి
ఏమి తెలియని ఎంకమ్మలా
దృశ్యశ్రవణ దూరవాణిగా
దూరిపోయింది ఎనభైలలో.
రోజులు పూటలు కాదు
గంటల్లో కాదు కాదు క్షణాలలో
జరిగింది జరిగినట్టుగా
కళ్ళ ముందు కట్టినట్టు
చూపిస్తుంది.
అది ఇది అని తేడా లేదు
ధారావాహికలతో దద్దరింపజేసి
వార్తలను కూడా వడ్డిస్తుంది
వినోదాలను పంచుతుంది.
పాడుతాతీయగా అంటూ
పాయసంలాంటి పాటలందిస్తుంది
ఆట పాటలను అందిస్తూనే
కోటికి పడగలెత్తిస్తుంది.
విందుల వంటలు నేర్పుతుంది
విజ్ఞానాల విషయం
విడమరుస్తుంది
ఒకటేమిటి
సర్వం తానై భక్తితో సహా
మంచి చెడులను బోధిస్తుంది.
మొట్టమొదట
నలుపు తెలుపుల
పెట్టెలా వచ్చినా
రంగు రంగుల తెరలు తెరలుగా
మారిపోయి
నట్టింట తిష్ట వేసింది.
-నగునూరి రాజన్న

## దూరదర్శిని

టెలివిజన్ అంటే దూరదర్శిని!
దూరాన ఉన్నవి దర్శించే సాధనం!
ఏ కాకీ వాలని ఇంట్లో ఏకాకిగా
పిల్ల కాకులు రెక్కలొచ్చి ఎగిరిపోగా
గతి లేక మిగిలిన
మతి లేని వృద్ధుల
కాలక్షేపమే ఈ టెలివిజన్!
ఈ బుల్లి పెట్టెలో ఎన్నో కబుర్లు!.
మునుపుండేవి మంచి వార్తలు
సంగీతం, సాహిత్యం ఒకటేమిటి
కథలు, ఆటలు, పాటలతో ఆనందమే!
ఇప్పుడు ఎక్కడ అవి టెలివిజన్లో?
ఏ ఛానల్ చూసినా
ఏముంది దృశ్యం!
హత్యలు, దోపిడీలు మానభంగాలు
బస్సులో సజీవ దహనం,
విహారయాత్రలో విశృంఖల కాల్పులు!.
ప్రకృతి వైపరీత్యాలు ఎన్నెన్నో!
రైలు ప్రమాదాలు
విమానం కూలడాలు
ఇప్పుడు ఎంతో భయంకరంగా
జరిగినదానికన్నా ఎక్కువగా
చూపించి ప్రజలను భయపెడతాయి !.
అర్ధ నగ్న దుస్తులతో మహిళలు
అఘాయిత్యాలు చేసే ఆడ విలన్లు
ఇప్పుడు సీరియల్స్ లో!
వంటా వార్పూ మాని ఇల్లాళ్ళు అందరూ
టెలివిజన్ ముందే బైఠాయించి
సీరియల్స్ చూడడమే పని
ఎన్నేళ్లయినా పూర్తిగాని సీరియల్ కోసం
ఆకలిదప్పులు మానుతున్నారు!.
పంటలు, వ్యవసాయం గురించి
విద్య, వైద్య విషయాల గురించి
పుణ్యక్షేత్ర దర్శనం గురించి
జ్ఞానం వచ్చే క్విజ్జుల గురించి
మంచి కుటుంబ నాటికల గురించి
దృశ్యాలు ఇప్పుడు ఎక్కడ?
టెలివిజన్ తో పాటు జత కలిసే
చరవాణి, ట్యాబులు!
టీవీతో ఆఖరికి నష్టాలే ఎక్కువ!.
-కోలా సత్యనారాయణ

## రేడియో పాలిట.....

రేడియో ఉన్న రోజులెంత
బాగుండేవి
గళానికి ప్రాధాన్యత
నిజంగా అపురూపం
గళాలతో నటించవచ్చునని
గట్టిగా తెలిసిన కాలం
జాతీయ అనువాద నాటకాల
ప్రదర్శన ఎంత గొప్ప
దూరదర్శని రాక
అప్పటివరకు ఉన్న క్రియాశీలత
మొత్తం దూరమైన
పనికి రాని క్షణాలు
నలుపు తెలుపుల
ముఖాలను చూడటం
అదే చాలని సంతృప్తి పడటం
రేడియో స్వర్ణయుగానికి
బలవంతంగా తెర
నేటి రోజున పిచ్చిపట్టించే
జీడి సీరియళ్లు
పనికిమాలిన సినిమా
బేస్డ్ కార్యక్రమాలు
ఏముంది
నేటి టీవీ గురించి చెప్పడానికి.
-ప్రశాంతి రేవూరి

## చాప కింద నీరు

వెగటు హాస్యాలు
భయంకర హింసలు
పగ, ప్రతీకారాల
కాలుష్య వాయువులు!.
సర్కస్ ఫీట్ల నృత్యాలు
ద్వంద్వార్థాల సంభాషణలు
శిఖండి వేషధారణలు
బట్టబయలు వస్త్రధారణలు
వింటున్నభాషపై
సందేహం రేకెత్తించే ఉచ్చారణలు
శ్రుతి మించిన శృంగార సన్నివేశాలు
విష ప్రయోగాలకు సైతం వెనుకాడని
అత్తాకోడళ్ల అనుబంధాలు
ఆధిపత్య ధోరణి
దాంపత్య బంధాలు!.
ఇంటిని, వంటిని గుల్ల చేసే
ఆకర్షణీయమైన ప్రకటనలు
ఉన్నదంతా ఊడ్చేసే ఆన్లైన్ జూదాలు
ఆడదంటే ఆట వస్తువేననే భావనను
"విశిష్ట భారతీయ సంస్కృతి అంటే
ఇదా?!" అని ఈసడించుకునేలా
"పాటించే ఆచార సాంప్రదాయాలు
ఇవేనా?!"అని నిర్ఘాంతపోయేలా!
చాప కింద నీరులా
ఇంజక్షన్ ద్వారా
శరీర భాగాల్లోకి పరుచుకునే
మత్తుమందులా మాధ్యమాల ద్వారా
ప్రేక్షకుల మెదళ్లలోకి చొచ్చుకుపోయి
దుమ్ము ధూళిలా విస్తరిస్తూ
కాలుష్య మేఘాల్లా
కమ్ముకుంటున్న కనబడని కాలుష్యం
యువత భవితను ప్రశ్నార్థకం చేస్తూ!!.
-చంద్రకళ దీకొండ

## దృశ్య శ్రవణం

ప్రతి ఇంటా ఇదో గోల
సమయం సందర్భం లేనేలేదు
పురుష పుంగవులకు
రాజకీయ చర్చ
మహిళామణులకు
ధారావాహికలు
చిన్న పిల్లలకు బొమ్మల ఆటలు
ఇంటింటా ప్రతి ఇంటా
ఇదో అధ్యాయం
లేచింది మొదలు
పడుకునేదాకా
ఇంట్లో ఎన్నెన్నో
దృశ్యశ్రవణ మాలికలు
మనసుకు ఆహ్లాదావేశాలు
ఇంట్లో కూర్చున్నచోటే
విశ్వదర్శనం ప్రత్యక్ష వీక్షణ
పొడిపొడిగా మనముందు
ఆట పాటలతో అలరింపు
ఆటవిడుపుతెలుపు నలుపుల
దృశ్యశ్రవణం ఆనాడు
రంగురంగుల
రమణీయ దృశ్యాలు ఈనాడు
విశ్రాంతి వేళ వీక్షణమంటున్న
వయోధికులు
ఇంటింటికీ ఒక వంటగది
ప్రతి ఇంట్లో దృశ్య శ్రవణ దర్బారు
ప్రతి ఇంట్లో ప్రతి ఒక్కరూ
కలిసే చోటిది.
-లక్ష్మారెడ్డి పసుల






## ఇప్పటికైనా కళ్ళు తెరుద్దాం

తినే ప్రతిపదార్థం కల్తీ
త్రాగే ప్రతి ద్రావణం కల్తీ
నిలబడే ప్రతి చోట అవినీతి కాలుష్యం
నాకే అన్ని కావాలన్న అవినీతి ఆశ
నా వాళ్లకు కూడా మిగల్చాలన్న అత్యాశ
ఈ అవినీతి కాలుష్యానికి తొలి శ్వాస
నా అవినీతి అధికారమే నడవాలన్న లడాయి
నా అధీనంలోనే ఉండాలనే బడాయి
ఈ అవినీతి కలుషితానికి పునాది రాయి
ఫలితంగా పుట్టుక నిండా అవినీతి లోపాలే
బ్రతుకు నిండా అవినీతి రోగాలే
జీవితాలన్నీ అవినీతిమయ అర్థారోగ్యాలే
చావులన్నీ అవినీతి అర్థాంతరాలే
ఇప్పటికైనా కళ్ళు తెరుద్దాం
అవినీతిని అంతం చేద్దాం
నవ సమాజ నిర్మాణానికి నడుము బిగిద్దాం.



-పింగళి భాగ్యలక్ష్మి
9704725609

## 'ఉషోదయ సాహితీ కిరణాలు, నిశ్శబ్ద శాంతి గీతం' పుస్తకాల ఆవిష్కరణ



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న అతిథులు

హైదరాబాద్, డిసెంబర్ 10: (నేటినిజం ప్రతినిధి): ప్రపంచ శాంతికి బుద్ధిజమే శరణ్యమని ఎస్వీ యూనివర్సిటీ పూర్వ వైస్ ఛాన్స్‌లర్ పద్మశ్రీ కొలకలూరి ఇనాక్ అన్నారు. శనివారం రవీంద్ర భారతిలోని సమావేశ మందిరంలో గౌతమ బుద్ధ ఫౌండేషన్ ఆవిర్భావ దినోత్సవాలలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కవి డా॥బిక్కి కృష్ణ సభాధ్యక్షతన జరిగిన ఈ వేడుకల్లో డా॥కోగంటి ఉషారాణి, కోగంటి శాంతిశ్రీ రాసిన 'ఉషోదయ సాహితీ కిరణాలు, నిశ్శబ్ద శాంతి గీతం' పుసకాలను కొలకలూరి ఇనాక్, మాజీ బీసీ కమిషన్ చైర్మన్ బి.యస్.రాములు ఆవిష్కరించారు. బుద్ధుని సందేశాలు ముందుతరాలకు అందించడానికి గౌతమ బుద్ధ ఫౌండేషన్ స్థాపించామని వ్యవస్థాపక అధ్యక్షులు డా॥ఉషారాణి తెలిపారు. డా॥విజయలక్ష్మి పండిట్, డా॥విడి రాజగోపాల్, డా॥జెల్ది విద్యాధర్, యలవర్తి ధనలక్ష్మి, చీకోలు సుందరయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ రంగాలలో సేవలందించిన సంగీతం రాజలింగం, అరిపూడి రమ, అంజనీకుమారి తదితరులను గౌతమ బుద్ధ జ్ఞాన పురస్కారాలతో సత్కరించారు.

## పాతూరి అన్నపూర్ణకు 'కళామిత్ర మండలి జాతీయ పురస్కారం'



డా॥పాతూరి అన్నపూర్ణను సన్మానిస్తున్న అతిథులు

నెల్లూరు, డిసెంబర్ 10: ప్రముఖ రచయిత్రి నెల్లూరు రచయితల సంఘం (నెరసం) ప్రధాన కార్యదర్శి డాక్టర్ పాతూరి అన్నపూర్ణకు కళామిత్ర మండలి జాతీయ పురస్కారాల్లో భాగంగా కరణం జ్ఞానేశ్వరి స్మారక సాహితీ ప్రతిభా పురస్కారం లభించింది. ఆదివారం ఒంగోలులోని ఎన్టీఆర్ కళా క్షేత్రంలో జరిగిన మండలి వెంకట కృష్ణారావు శత జయంతి వేడుకలు, కళామిత్ర మ ండలి 19వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో భాగంగా ముఖ్య అతిథులు ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, అవనిగడ్డ ఎమ్మెల్యే డాక్టర్ మండలి బుద్ధప్రసాద్, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు, రిటైర్డ్ సీబీఐ జేడీ వీవీ లక్ష్మీ నారాయణలు ఇతర అతిథులతో కలిసి డాక్టర్ పాతూరి అన్నపూర్ణకు ఈ పురస్కారానికి అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ పురస్కారం తనపై బాధ్యతను మరింత పెంచిందన్నారు. సాహిత్య, సామాజిక రాజకీయ రంగాల్లో లబ్ద ప్రతిష్టులైన వారి చేతుల మీదుగా ఈ పురస్కారం అందుకోవడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. నూనె అంకమ్మరావుకు,తేళ్ల అరుణకు, కరణం విమల తదితరులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు.








## కణిక

సాహిత్యం, సామాజిక సేవ, విద్యారంగ వేదిక నిర్వహిస్తున్న
**'బుధవారం బాద్షా'**
**పోటీ ఫలితాలు**



అడ్మిన్:రమాదేవి కులకర్ణి
8985613123



నిర్వహణ:
శ్రీమతి సత్య నీలిమ

అంశం బాసటగా నిలుద్దాం

## పోరాటం సలపాలి

కులమత సంకుచిత్వాలు
వీడి, అసూయ ద్వేషాల కుంపట్లు
రగిలించక
సౌజన్యం, సౌభాతృత్వంతో
కూడిన
జీవనసరళితో
మానవులంతా మమేకమై
అపోహలు,
అపార్థాలకు తావివ్వక,
నిర్మలమైన మనసుతో
స్వార్థం లేని ప్రపంచంలో
అడుగిడడానికి
పోరాటం సలపాలి.
ప్రయత్నిస్తే అన్నీ సాధ్యమే.
కార్యసాధకులకి ఏకైక లక్ష్యం,
అనుకున్నది సాధించే
దిశగా వెళ్లటం.
చెలిమి పూల తోటలో
అందరం స్వచ్ఛతతో
కూడిన మరుమల్లెలయి
గుబాళింపులు వెదజల్లగా
విలువలతోకూడిన
సమాజాన్ని నిర్మిద్దాం.
మానవత్వానికి
ప్రతీకగా నిలిచి ప్రతి
ఒక్కరికి బాసటగా
నిలుద్దాం.
అశాంతిని చెరిపేసి
అన్యాయాలకు అక్రమాలకు
చెక్ పెట్టేసి
నీతి నిజాయితీలతో
కూడిన, నిస్వార్థపు
ప్రతిబింబాన్ని ప్రతిష్టిద్దాం.
ఇంకెన్నాళ్లు,ఇంకెన్నాళ్ళు ?
ఈ దగా ప్రపంచంలో
కుత్రలు, మోసాలు
అంతరించాలనీ
నిర్మలత,స్వచ్ఛత పోరాటపటిమ
నీలో పెనవేసుకుని ఉన్న నాడు
అంతర్యుద్ధంగా ఉన్న
శత్రువులను తుద ముట్టించు.
నీవు కలలుగనే
ఆబంగారు సమాజం.
ఏర్పడ్డానికి కొన్నేళ్లయినా
నీ కల నెరవేరి
ప్రపంచం స్వర్ణ యుగమై
భాసిల్లుతుంది.
-రాచర్ల సులోచన
హైదరాబాద్

## సౌభ్రాతృత్వం

కులమతాల అడ్డుగోడలు త్రెంచుకొని, ధనిక బీద తేడా
మరిచి,మానవత్వమే గొప్ప మతమని తలచి,
హృదయపు కవాటాలు ప్రేమగా తెరిచి,
సౌభ్రాతృత్వమే బాసటగా నిలుద్దాం..
ఆడ మగ భేదం మాని, అసూయ, ద్వేషం అసలేలేని,నిర్మలమైన
మనస్సుతో చెలిమి బాటలో, బాసటగా నిలుద్దాం??
అన్యాయాలు, అక్రమాలు ఛేదించి,చిరునవ్వుల కాంతులు
చిందించి, సమన్యాయం, సమానత్వం
వెదజల్లి,విలువలతో కూడిన సమ సమాజ స్థాపన కై
బాసటగా నిలుద్దాం??.
గాలిమేడల కలలు మాని,ఎల్లలు లేని నవసమాజానికై,
స్వచ్ఛమైన మనసులతో, చెరిగిపోని స్నేహంతో, హితోధిక కృషితో,
అరమరికలులేని బంధాలతో,సౌభ్రాతృత్వం
బాసటగా నిలుద్దాం.
-వనజ కృష్ణంరాజు.

## అసమానతలు తొలగిద్దాం.

ఒకరికొకరం తోడునీడగా
సాకారం అందించుకుందాం
మానవతను మరువకుండా
మనుషుల్లాగా బతికేద్దాం.
సమాజంలోని
కుళ్ళు కుతంత్రాలను
కలసికట్టుగా ఎదిరించుదాం
కుల మత అడ్డు గోడలను
కూల్చివేయగ ప్రయత్నిద్దాం.
మనలోని ఈర్ష్య అసూయలను
ఆమడదూరం తరిమికొడదాం
ప్రేమానురాగాలను మనలోననే
నింపుకొని జీవనం సాగిద్దాం.
స్వార్థాన్ని కొంత త్యజించుకొని
పరార్థం కోసం పాటు పడదాం
వెనకబడిన తోటి మనుషులకు
ఆసరాను అందించి నిలుద్దాం.
సమాజంలోని అసమానతలను
తొలగించగ ముందడుగేద్దాం
పేద గొప్ప తేడాలను లేకుండా
సమ సమాజ స్థాపన చేద్దాం.
-అక్కి నర్సింలు గౌడ్
9912659965

## బాటలు వేద్దాం

నవనాగరిక సమాజంలో
భారతీయ
సంస్కృతి సాంప్రదాయాలను
మరచి...
పాశ్చాత్య పోకడలకు యువత
పరుగులు పెడుతుంటే....
పాతతరం పెద్దలుగా...
మానవీయ విలువలు తెలిసిన
మనుషులుగా....
మౌనం వీడి....
తమ జీవితానుభవంతో
జీవిత పాఠాలను బోధిస్తూ
యువత భవిష్యత్ కు బంగరు
బాటలు వేద్దాం....
కులమతాల
కుంపట్లను రగిలిస్తూ
కొందరు స్వార్థపరులు తమ
స్వప్రయోజనాలకు యువతను
తప్పు దోవ పట్టిస్తుంటే...
మౌనం వీడి.. యువలోకానికి
మానవత్వ విలువలను నేర్పిస్తూ.
భావి భారత పౌరులకు
చేయూతనందిస్తూ
బాసటగా నిలుద్దాం....
నాగరికత పేరుతో
నేటి తరం వేస్తున్న తప్పటడుగులు
సరి దిద్దుతూ....
భరత జాతి సంస్కారాన్ని వివరిస్తూ
దేశ ఖ్యాతిని
నలుదిశలా పెంపొందిద్దాం
మాతృ దేశ గౌరవం నిలబెడదాం
నేటి తరానికి బాసటగా
నిలుద్దాం..!!
-లక్ష్మీ పద్మజ దుగ్గరాజు
9866328747

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com